# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :29 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 27-03-2025 పేజీలు:4 వెల: 2.00

## పెరుగుతున్న ఎండలతో ప్రజలు అప్రమత్తం కావాలి

కొత్తగూడెం, జిల్లా అధికారులంతా వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా అధికారులు హెచ్చరించారు. జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలపై దృష్టి పెట్టాలని, ఇప్పటికే 40 డిగ్రీల ఉష్ణోగ్రతలకు చేరువయ్యారని తెలిపారు. ప్రధానంగా కొత్తగూడెంలో ఎండలు ఎక్కువ కాబట్టి వడదెబ్బ మృతులను నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశు సంవర్ధక, వైద్య శాఖ అధికారులు ప్రజలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. వేసవిలో అధక ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు ప్రజలు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలనికోరారు. వేసవి ఉష్ణోగ్రతలపై అధికారులకు సూచనలను చేశారు. ప్రయాణం చేసేటప్పుడు గొడుగులు లేదా, తలకు వస్త్రాన్ని చుట్టుకొని వెళ్లాలని, ధరించే దుస్తులలో తెలుపురంగు దుస్తులను వాడాలన్నారు. వీలైనంత వరకు అందుబాటులో ఉన్న నిమ్మరసం, లేదా మజ్జిగను తీసుకోవాలన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను ప్రాథమిక అరోగ్య కేంద్రాలలో, వైద్య శిబిరాలలో తప్పక ఉంచాలని స్పష్టం చేశారు.

## కేబినెట్ నిర్ణయంతో రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం ఇవ్వబోతున్నాం..



హైదరాబాద్, తెలంగాణ అసెంబ్లీలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రేషన్ బియ్యంతో ఒక మాఫీయా నడిపిస్తున్నారు.. కేబినెట్ నిర్ణయం మేరకు రేషన్ కార్డు ఉన్న వారికి సన్న బియ్యం ఇవ్వబోతున్నాం..ఉగాది రోజు సన్న బియ్యం పథకం ప్రారంభం అవుతుంది అని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రేషన్ కార్డు హోల్డర్లకు 6 కిలోల సన్న బియ్యం ఫ్రీగా అందజేస్తాం.. సన్న బియ్యంపై సభ్యులు ఏమైనా సలహాలు, సూచనలు చేస్తే తీసుకుంటాం.. ఏప్రిల్ మాసంలో కొత్త రేషన్ బియ్యం వస్తుంది.. ఈ పథకంతో 84 శాతం మంది పేద ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.. సన్న బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులు కూడా త్వరలో ఇస్తామని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు.ఇక, గత ప్రభుత్వం చేసిన అప్పులు ప్రస్తుత ఇరిగేషన్ బడ్జెట్ లో పెట్టామని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. ప్రాజెక్టుల పేరిట అప్పులు తీసుకున్నారు కానీ ప్రాజెక్టులు పూర్తి చేయలేదు, ఆయకట్టు పెరగలేదన్నారు. ప్రాజెక్టుల విషయంలో ఎలాంటి వివక్ష ఉండదు అని తేల్చి చెప్పారు. కేటగిరి బేస్ గా ప్రాజెక్ట్ లు పూర్తి చేస్తున్నాం.. అలాగే, SLBC ఘటన చాలా బాధాకరం.. ఈ ఘటన జరిగిన మూడు గంటల్లో నేను అక్కడ ఉన్నాను.. రెస్క్యూ ఆపరేషన్ వేగవంతం చేస్తున్నాం.. ఇప్పటికీ ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## శాసన మండలిలో పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం..

హైదరాబాద్,శాసన మండలిలో పంచాయతీరాజ్ సవరణ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ సవరణ-2025 బిల్లుపై చర్చ సందర్భంగా సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు.ఈ బిల్లుపై చాలా మంది సభ్యులు విలువైన సూచనలు చేశారు.. ఈ బిల్లులో లేని అంశాలను సభ్యులు ప్రస్తావించారు.. సభ్యులు ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తాం.. రాష్ట్రపతి ఉత్తర్వుల మేరకు ఆదిలాబాద్ నుంచి అచ్చంపేట వరకు షెడ్యూల్ ఏరియాలో గుర్తించారు.. ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం.. మాకు మున్సిపాలిటీ కావాలని ఎన్నో గ్రామ ప్రజలు అడుగుతున్నారు.. మున్సిపాలిటీలు అయితే డెవలప్ అయితామని అనుకుంటున్నారు. ములుగు జిల్లా కేంద్రమైనా మునిసిపాలిటీ చేయలేదు.. కానీ, ఇప్పుడు మనం ములుగును మున్సిపాలిటీగా చేసుకుంటున్నాం.. ప్రజల అభిప్రాయం, కలెక్టర్లు పంపిన ప్రతిపాదనలు ఆధారంగా మున్సిపాలిటీలుగా అప్డేట్ చేస్తున్నాం.. చాలా మండలాల్లోని గ్రామాలను ఇతర జిల్లాల్లో కలిపారు.. స్థానిక ఎన్నికల సందర్భంగా ఎన్నో గందరగోళాలు తలెత్తుతున్నాయని మంత్రి సీతక్క చెప్పుకొచ్చింది.ఇక, కొన్ని గ్రామాలు ఒక మండల పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంటున్నాయి.. రెవిన్యూ పరిధి వేరే మండలంలో ఉంటుంది అని మంత్రి సీతక్క పేర్కొనింది. ఆ




సమస్యలకు పరిష్కారం చూపుతాం.. ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తేయాలని అడుగుతున్నారు.. కేబినెట్, ముఖ్యమంత్రితో చర్చిస్తాం.. కొత్త గ్రామ పంచాయతీలలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనను పరిశీలిస్తాం.. గ్రామాల్లో సమస్యలు ఉన్నాయని కొందరు సభ్యులు ప్రస్తావించారు.. వాటిని పరిష్కరిస్తున్నాం.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లు ఆమోదించుకున్నాం.. కేంద్రం ఆ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తే రిజర్వేషన్లు పెరుగుతాయి.. అన్ని పార్టీలు కేంద్రం మీద ఒత్తిడి తేవాలి అని సీతక్క కోరారు.

## పంటలు ఎండుతున్నా ఈ ప్రభుత్వానికి సోయి లేదు

జోగులాంబ గద్వాల : రాష్ట్రంలో పంటలు ఎండుతున్నా ఈ ప్రభుత్వానికి సోయిలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో ఎండిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. యాసంగిలో రాష్ట్రంతోపాటు జోగులాంబ గద్వాల జిల్లాలోని నెట్టెంపాడు ప్రాజెక్టు పరిధిలో పంటలు ఎండుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదని నిరంజన్ రెడ్డి అన్నారు.ప్రభుత్వం IAB సమావేశం నిర్వహించకుండా యాసంగి పంటల ప్రణాళిక రూపొందించిందని మాజీ మంత్రి చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఇక్కడి రైతుల పొలాలకు నీరు ఇచ్చి పంటలను కాపాడలేక పోయారని వాపోయారు. ముఖ్యమంత్రి తన సీటును కాపాడుకోవడానికి ప్రయత్నిస్తుంటే నీటిపారుదల మంత్రి రైతుల బాగోగులు పట్టించుకోకుండా ఆ సీటుపై కన్నేశాడని అన్నారు. పాలమూరు జిల్లా మంత్రికి కక్షలు కార్పణ్యాలపై ఉన్న శ్రద్ధ రైతుల పంటలను కాపాడడంలో లేదని చెప్పారు.తెలంగాణలో కాంగ్రెస్ పార్టీయే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉందని, అయినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేయించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఓవైపు పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతుంటే వారిని పరామర్శించడానికి కూడా ఈ నాయకులకు తీరిక లేదని విమర్శించారు. పదేళ్లలో ఎప్పుడు కూడా రైతుల పంటలు ఎండకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాపాడితే.. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంటలు ఎండడానికి కారణమయ్యాడని ఆరోపించారు.ప్రస్తుతం రైతులకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని మాజీ మంత్రి ప్రశ్నించారు. వరంగల్ డిక్లేషన్‌లో రైతులకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతు భరోసాను మూడు ఎకరాలతోనే బందు చేసిందని అన్నారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి ఒట్లు వేసి అటు దేవుళ్లను,



ఇటు రైతులను నిండా మోసం చేశాడని ఆరోపించారు. ఏడాదిన్నర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల నుంచి వ్యతిరేకతను మూటగట్టుకుందని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రేలంపాడు రిజర్వాయర్‌లో నాలుగు టీఎంసీల నీటిని నిలువ చేసుకోలేని పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ యాసంగిలో రైతులు ప్రభుత్వం, అధికారుల మాటలు విని పంటలు సాగు చేస్తే.. ఆ పంటలకు ప్రస్తుతం నీరులేక ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం వెంటనే వారికి నష్టపరిహారం చెల్లించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు.ఆర్డీఎస్ పరిధిలో గత 50 ఏళ్ల కాలంలో ఏనాడు కూడా ఇలాంటి పరిస్థితి కనిపించ లేదని మాజీ మంత్రి అన్నారు. ప్రస్తుతం ఆర్డీఎస్ కింద 47,000 ఎకరాలలో రైతులు వివిధ పంటలు సాగుచేశారని, ప్రస్తుతం పది రోజులుగా నీరు నిలిచిపోవడంతో పంటలు ఎండిపోయే దశకు చేరుకున్నాయని చెప్పారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడి నాలుగు టీఎంసీల నీటిని విడుదల చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతుల పంటలు కాపాడాలని మాజీ మంత్రి కోరారు. ఈ సందర్భంగా మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు బాస్ హనుమంతు నాయుడు, అంగడి బసవరాజు, పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీరాములు, మోనేష్ కుమార్, కురువ పల్లయ్య తదితరులు ఉన్నారు.

## సభలో కమీషన్లపై రచ్చ... కెటీఆర్ - భట్టి ఢీ అంటే ఢీ




హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టర్లు చేపట్టిన పనుల్లో 30 శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ ప్రభుత్వంపై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ లో ఉన్న నేతలే అసెంబ్లీలో ఆ విషయంపై బహిరంగంగా చర్చించుకుంటున్నారని సభలో ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అగ్గిమీద గుగ్గిలం అయ్యారు.. అలాగే ఒక్కసారిగాకాంగ్రెస్ సభ్యులు లేచి కెటిఆర్ క్షమాపణ చెప్పాలంటూ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సభ్యులకు వ్యతిరేకంగా సభలో నినాదాలు చేశారు. దీంతో అసెంబ్లీలో గందరగోళ పరిస్థితి ఏర్పడింది.మాజీమంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మంత్రులు ఎందుకు ఎగ్జైట్ అవుతారు.. మంత్రులకు సంయమనం ఉండాలి అన్నారు. మేము అడుగుతాం.. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇవ్వలేదని అంటాం.. ఇక, 30 శాతం కమిషన్ అని వాళ్ళ ఎమ్మెల్యేలు అంటున్నారని కేటీఆర్ అన్నారు. దీనిపై భట్టి మాట్లాడుతూ, మీ లాగా విలువలు లేని రాజకీయాలు చేయడం లేదని అన్నారు.. బిఆర్ఎస్ సభ్యులు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు అంటూ మండిపడ్డారు. దోచుకున్న ది నువ్వు.. రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసింది మీరు.. మాపై నిందలు వేస్తారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 శాతం కమిషన్ అని అడ్డగోలుగా మాట్లాడితే ఎలా. కేటీఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని భట్టి డిమాండ్ చేశారు. దమ్ముంటే తాను కమీషన్ లు తీసుకున్నట్లు నిరూపించాలని డిమాండ్ చేశారు.అందుకు కెటిఆర్ నిరాకరిచడంతో ఆ వ్యాఖ్యాలను రికార్డ్స్ నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ఇక భట్టి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ఇక, కేటీఆర్ డెమోక్రసీ అంటున్నారని,.. పద్ధతిగా ఉంటారని అనుకున్నామన్నారు. అయితే ఆయన ఇష్టం వచ్చినట్లు ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం పద్దతి కాదని భట్టి హితవు పలికారు. వాస్తవంగా చర్చ జరగకుండా సభను తప్పుదోవ పట్టిస్తున్నారని ఫైర్ అయ్యారు%ౌ%. బీఆర్ఎస్ )లా తాము బరితెగించి రాజకీయాలు చేయడం లేదని మాటల తూటాలతో విరుచుకుపడ్డారు. రాష్ట్రాన్ని పదేళ్ల పాటు పాలించి అడ్డగోలుగా దోచుకున్నారని ఫైర్ అయ్యారు. బీఆర్ఎస్ నాయకులు ఇకనైనా ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే భట్టి వ్యాఖ్యలపై కేటీఆర్, బీఆర్ఎస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. సభలో మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని స్పీకర్ కోరగా అందుకు ఆయన నిరాకరించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసి అసెంబ్లీ ప్రాంగణంలో నిరసనకు దిగారు.

## గర్భిణీ స్త్రీల పథకాన్ని కేంద్రం పట్టించుకోవడం లేదు



హైదరాబాద్,గర్భిణీ స్త్రీల పథకాన్ని కేంద్రం పట్టించుకోవడం లేదని.. ఈ పథకానికి నిధుల కొరత తీవ్రంగా ఉందని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ సోనియాగాంధీ ఆరోపించారు.బుధవారం సోనియాగాంధీ రాజ్యసభలో ప్రసంగించారు. జాతీయ ఆహార భద్రతా చట్టం, గర్భిణీ స్త్రీల పథకంపై ప్రసంగించారు. బిడ్డకు జన్మినిచ్చిన తల్లికి రూ.6 వేలు ప్రసూతి ప్రయోజనాలు అందుతాయని.. ఇవి రెండు విడతలుగా చెల్లిస్తారన్నారు. రెండోసారి ఆడబిడ్డ అయితే ఈ పథకం వర్తిస్తుందన్నారు. కానీ ప్రస్తుతం ఈ పథకం కుంటుపడిందని.. దీనికి నిధులే లేవని ఆరోపించారు.జాతీయ ఆహార భద్రతా చట్టం అమలుకు రూ.12,000 కోట్లు అవసరం అన్నారు. కానీ రాబోయే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే కేటాయించారని సభ దృష్టికి సోనియా తీసుకొచ్చారు. ఇక గర్భిణీ స్త్రీలకు రెండు విడతలుగా అందాల్సిన నగదు అందడం లేదన్నారు. 2022-23లో 68 శాతం మందికే ఒక విడత డబ్బులే అందాయని.. అనంతరం ఆ నిష్పత్తి బాగా తగ్గిపోయిందన్నారు. క్రమక్రమం ఆ నిష్పత్తి పూర్తిగా పడిపోతూ వచ్చిందని తెలిపారు.

### ఇసుక అక్రమ రవాణాకు చెక్

కరీంనగర్,ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై దొంగతనం కేసులు నమోదు చేస్తామని మైనింగ్ అధికారులు స్పష్టం చేశారు. పట్టుబడిన వాహనాల డ్రైవర్లు, యజమానులపై కూడా కేసులు నమోదు చేసి, వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుకను అక్రమంగా నిల్వ చేయొద్దనీ, అలా చేస్తే సంబంధిత భూ యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దు..

హైదరాబాద్ : రాష్ట్ర పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దని.. ఎవరైనా పోలీసులను ఉపయోగించుకొని ప్రభుత్వాన్ని నడిపితే.. గత బీఆర్ఎస్‌లా తాము ప్రతిపక్షంలో ఉండాల్సి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో నేడు జరిగిన ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో ఎంఎంటీఎస్‌లో యువతిపై అత్యాచారయత్నం ఘటనపై మాట్లాడుతూ నగరంలో శాంతి భద్రతలు క్షీణించాయని అనడానికి ఈ ఘటన నిదర్శమన్నారు..

రాజధాని నగరంలో యువతిపై అత్యాచారయత్నం జరిగి రెండు రోజులు అవుతున్నా నిందితుడిని పట్టుకోలేదని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆరోపించారు.కాగా, పల్లా వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందిస్తూ.. హైదరాబాద్ లోక్ ట్రైన్ అయిన ఎమ్ఎమ్‌టీఎస్‌లో జరిగిన ఘటనలో నిందితుడిని పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారని సమాధానమిచ్చారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసులకు సంబంధించి సంస్కరణలు చేసిందన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్



కొనసాగుతున్నదని, నేరస్తులపై ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. రాష్ట్ర పోలీసులను రాజకీయాల్లోకి లాగొద్దని.. ఎవరైనా పోలీసులను ఉపయోగించుకొని ప్రభుత్వాన్ని నడపడం వల్ల బీఆర్ఎస్ ప్రతిపక్షంలో కూర్చున్నదని చురకలటించారు.

## యూపీలో ముస్లింలు అత్యంత సురక్షితంగా ఉన్నారు

లక్నో: ఉత్తరప్రదేశ్ (ఉత్తరప్రదేశ్) రాష్ట్రంలోని మైనారిటీ కుటుంబాలు (ముస్లిం కుటుంబాలు) అత్యంత సురక్షితంగా ఉన్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ (యోగి ఆదిత్యనాథ్) అన్నారు. హిందువులు (హిందూ కుటుంబాలు) సురక్షితంగా ఉంటే.. ముస్లింలు కూడా సురక్షితంగా ఉంటారని చెప్పారు. తానొక యోగినని.. మనుషులంతా సంతోషంగా ఉండాలన్నదే తన అభిమతమని ఆయన ఏంటో.'ఉత్తరప్రదేశ్‌లో ముస్లింలు అత్యంత సురక్షితంగా ఉన్నారు. హిందువులు సురక్షితంగా ఉంటే.. వారు కూడా సురక్షితంగా ఉంటారు. 2017కి ముందు యూపీలో అల్లర్లు జరిగితే హిందూ దుకాణాలు కాలిపోతుండేవి. అప్పుడు ముస్లిం దుకాణాలు కూడా కాలిపోయేవి. హిందువుల ఇళ్లు కాలిపోతే.. ముస్లింల ఇళ్ల కూడా కాలిపోయేవి. కానీ, 2017 తర్వాత అంతా మారిపోయింది. ఒక యోగిగా నేను అందరి ఆనందం కోరుకుంటాను. బీజేపీ అధికారం చేపట్టాక రాష్ట్రంలో మతపరమైన అల్లర్లు ఆగిపోయాయి. 100 హిందూ ఇళ్లు ఉన్న ఏరియాలో ఒక ముస్లిం కుటుంబం సురక్షితంగా ఉంటోంది. 100 ముస్లిం కుటుంబాలు



ఉన్న ప్రాంతంలో ఒక్క హిందూ కుటుంబం, లేదా 50 హిందూ కుటుంబాలు సురక్షితంగా ఉంటాయా..? లేదు కదా. ఇందుకు బంగ్లాదేశే ఓ ఉదాహరణ. పాకిస్థాన్ మరో ఉదాహరణ' అని సీఎం యోగి.

## రేప్ పై జడ్జి వ్యాఖ్యలు అమానవీయం...తీర్పుపై సుప్రీం స్టే



న్యూఢిల్లీ,మహిళల దుస్తులను పట్టుకుని లాగడం, ఛాతి భాగాన్ని తాకడం అత్యాచార నేరం కిందకు రాదని అలహాబాద్ హైకోర్టు జడ్జి ఇటీవల ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. తీర్పు సందర్భంగా అలహాబాద్ న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు అమానవీయంగా ఉన్నాయని పేర్కొంది.

అలహాబాద్ జడ్జి వివాదాస్పద తీర్పుపై జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్ ధర్మాసనం సుమోటోగా స్వీకరించి బుధవారం విచారణ చేపట్టింది. జడ్జి వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేసిన ధర్మాసనం, వాటిపై వివరణ ఇవ్వాలని కేంద్రంతోపాటు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ఏం జరిగిందంటే..

2021 నవంబరులో ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓ బాలికను బైక్‌పై ఇంటి వద్ద దింపుతామని ఎక్కించుకుని ఇద్దరు యువకులు అనుచితంగా ప్రవర్తించారు. బాలిక అరుపులు విని అటుగా వెళ్తున్నవారు రావడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ కేసుపై మార్చి 17వ తేదీన అలహాబాద్ హైకోర్టు విచారణ జరిపింది. ఆ సమయంలో జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా, మహిళ వక్షోజాలను తాకడం, దుస్తులు పట్టుకొని లాగినంత మాత్రాన అత్యాచారం కిందకు రాదని తీర్పు వెలువరించారు.అయితే.. ఆ తీర్పు కాస్త వివాదాస్పదంగా మారింది. న్యాయమూర్తి వ్యాఖ్యలు న్యాయస్థానాలపై గౌరవాన్ని తగ్గించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తమైంది. కేంద్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి అన్నపూర్ణాదేవి కూడా అలహాబాద్ కోర్టు తీర్పుపై స్పందించారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు. ఇలాంటి వ్యాఖ్యలతో సమాజంలోకి తప్పుడు సందేశం వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ జరిపి ఆ తీర్పుపై స్టే విధించింది.

## సంపాదకీయం

గురువారం 27-03-2025

### కానరాని ఆర్థిక పునరుత్తేజం !

ఆర్థిక పునరుత్తేజం కోసం భారత రిజర్వ్ బ్యాంక్ వేసుకున్న లెక్కలు తలకిందులు అయ్యాయి. క్షీణిస్తున్న రూపాయి విలువతో ఈ ఏడాది ఆసియాలోకెల్లా బాగా దెబ్బతిన్న కరెన్సీ ఇప్పుడు మనదేనన్నదంలో ఎలాంటి సందేహం లేదు. ఇక, స్టాక్‌మార్కెట్ కష్టాలు సరేసరి. ఈ మధ్య అవి కూడా తలకిందులు అవుతున్నాయి. భారత్ ఇప్పుడు ఆర్థిక, వాణిజ్య లోటులు రెంటినీ ఎదుర్కొంటోంది. జాతీయ, అంతర్జాతీయ ధరలు పెరుగుతుండడంతో దేశంలో ద్రవ్యోల్బణంపైన వైఖరిని భారత రిజర్వ్ బ్యాంక్ పునఃసమీక్షించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ధరలు ఇలానే పెరుగుతూ పోతే, వృద్ధిపై గట్టి దెబ్బ పడుతుంది. ఆర్బీఐ తక్షణ దిద్దుబాటు చర్యలు చేపట్టడం ద్వారా రూపాయి విలువ మరింత పడిపోకుండా చూడాలి. ప్రజల్లో ఆర్థిక లావాదేవీలు పెరగాలి. సత్వర కార్యాచరణ చేపట్టడం ద్వారా ప్రజలకు పనులు కల్పించే పనులు చేయాలి.ప్రజల్లో రూపాయి చలామణి అయ్యేలా చేయాలి. ఉత్పత్తి రంగాలకు ప్రోత్సాహం ఇవ్వాలి. ధాన్యం నిల్వలు ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా చేస్తే తప్ప ఆర్థిక రంగం బలపడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే దేశంలో ఆర్థిక విధానాలు నానాటికి దిగజారుతున్నాయి. కేవలం పన్నుల మీద ఉన్న శ్రద్ధ మరోదానిపై కనిపించడం లేదు. ప్రతిదీ పన్నుల కింద జమకట్టం, బ్యాంకుల వడ్డింపులు, వడ్డీల తీరు కారణంగా సామాన్యులకు జీవించడం కష్టంగా మారుతోంది. ప్రభుత్వం ఉన్నది పన్నులు వసూలు చేయడానికి తప్ప ప్రజల కోసం కాదని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రుజువు చేసుకున్నాయి. డిల్లీలో కూర్చుని లెక్కలు వేయకుండా ప్రజల ఆర్థిక స్థితిగతులను లెక్కలు వేస్తే ఆర్థిక పరిస్థితి ఏంటన్నది చూడాలి. బంగారం కొనడానికి లేదు. పుస్తెలు చేయించుకోవాలంటేనే భయపడే రోజులు దాపురించాయి. అదేపనిగా బంగారం,వెండిధరలు పెరిగి పోతున్నాయి. భూములు అందుబాటులో లేవు. అలాగే ఇళ్లు కట్టుకునే వీలు లేదు. ఆహార ధాన్యాలు కొనే ధైర్యం లేదు. తిండి తినడం కూడా భయంగా మారింది. బ్యాంకులు ఎగవేతదారులను వదిలి సామాన్యుల వెంట పడుతున్నాయి. ఇలా అన్ని విధాలా ధరలు పెరిగిపోతున్నా..పాలకులు పట్టించు కోవడం లేదు. సరికదా అభివృద్దికి ఇదే సూచిక అని చంకలు గుద్దుకుంటున్నారు పెట్రోల్, డీజిల్,గ్యాస్ ధరలు కూడా ప్రజల జీవనంపై తీవ్రప్రభావం చూపుతోంది. ఉక్రెయిన్ యుద్ధ ప్రకంపనలు ప్రపంచమంతటినీ తాకుతున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలు కూడా మనపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అక్కడి సెగ ఇక్కడి మన స్టాక్ మార్కెట్లు, మదుపరులు, ఆర్థిక విధాన నిర్ణేతలు ఇలా ప్రతి ఒక్కరికీ తగులుతోంది. భారత ఆర్థిక వ్యవస్థపై భారం పడనుంది. ఇప్పటికే స్టాక్ మార్కెట్ల పతనం, ఎన్నడూ లేనట్టు డాలర్‌కు 85 రూపాయల స్థాయికి కరెన్సీ విలువ క్షీణించడం, పెరగనున్న చమురు ధరలు వెక్కిరిస్తున్నాయి. అనేక అవాంతరాల మధ్య క్రమంగా కోలుకుంటోందని భావిస్తున్న దేశ ఆర్థికరంగం రానున్న రోజుల్లో ఇంకెంత ఒత్తిడికి గురవుతుందోనని ఆందోళన కలుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతుండడం మన ఆర్థిక విధాన నిర్ణేతలకు సవాలు కానుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ కూడా పడిపోతోంది. చమురుకు తోడు వంటనూనెలు ఉన్నాయి. ప్రపంచం లోసన్‌ఫ్లవర్ నూనెలో అయిదింట నాలుగొంతులు రష్యా, ఉక్రెయిన్‌ల ఉత్పత్తి కావడం గమనించాలి. మన సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతుల్లో 90 శాతం ఆ రెండు దేశాల నుంచే వస్తాయి. పామాయిల్, ఆవనూనెల ధరలు ఇప్పటికే పైకి చూస్తున్నాయి. మన దగ్గర ఆహారధాన్యాల ఉత్పత్తి పెరుగుతున్నా వాణిజ్య పరంగా వాటిని ఎగుమతులు చేసుకునే వ్యూహాలు కానరావడం లేదు. పసుపు, మిర్చి,అల్లం, వెల్లుల్లి, బియ్యం, పత్తి వంటి వాణిజ్య పంటలను అత్యధికంగా ఎగుమతి చేసుకునే విధానాలు రూపొందాలి. మన ఎగుమతులను సమీక్షించుకుండా అదే పనిగా దిగుమతులు పెరిగితే ద్రవ్యోల్బణం పెరగడమే గాకుండా రూపాయి మారకవిలువ కూడా పెరగడం ఖాయం. వంటనూనెలు మరింత ప్రియం కానున్నాయి. కీలకమైన ఈ ఇంధనాల ధరలు ఇలా పెరిగిపోతుండడం వల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. ధరలు ప్రజల శక్తికి మించి పెరుగుతున్న చోట సామాజిక సంక్షోభం తలెత్తనుంది. నిత్యావసర సరకులు కొనుక్కోలేని అశక్తత ఏర్పడి అది అశాంతిని సృష్టించి వీధుల్లో అలజడికి కారణం అవుతుంది. ఈ కారణంగా మన దేశీయ ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడం తప్పనిసరి. అలాగే ప్రజల్లో కొనుగోలు శక్తి పెరిగేలా ఆర్థిక కార్యకలాపాలు సాగాలి. ఎగుమతులను పెంచాలి. ప్రభుత్వరంగ సంస్థలను బలోపేతం చేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెంచాలి. అమ్మకాలతో లాభం లేదని గుర్తించాలి. ఇవేవీ చేయ కుండా ఎన్ని కసరత్తులు చేసినా లాభం లేదని గమనించాలి. ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం కాకముందే పాలకులు మేల్కోవాలి. లేకుంటే పరిస్థితి సామాజిక సంక్షోభానికి దారితీయగలదని గుర్తించాలి. మనం పండిస్తున్న మిర్చి, పసుపు, పత్తి లాంటి పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించాలి. ఇక్కడి ఉత్పత్తులు ప్రజలకు చేరాలి. ప్రభుత్వం సరైన మార్కెటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. బ్యాంకుల వడ్డీ రేట్లు తగ్గితే తప్ప రియల్ రంగం పుంజుకోదు. ఇవన్నీ ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటే తప్ప ఆర్థికరంగం గాడిన పడదు.

# పేదలకు న్యాయం చేయాలన్నదే సీఎం తపన



అమరావతి,రాష్ట్రంలో ప్రైవేటు భూములేవీ కూడా 22ఏలో ఉండకూడదనేదే ప్రభుత్వ ఆశయమని, ఆ దిశగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. ప్రజలకు భూమి అనేది సెంటిమెంటుతో కూడుకున్న వ్యవహారమని, పేదలకైతే అది ఒక భరోసా, క్షేత్రస్థాయిలో ప్రజలు తమ భూములకు సంబంధించి వివాదాలు లేకుండా హాయిగా ఉండాలని చూడటమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజల భూ వివాదాల పరిష్కారానికి జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. సచివాలయంలో మంగళవారం ప్రారంభమైన 3వ జిల్లా కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేదలకు మేలు చేయాలనే ఒక దృఢసంకల్పంతో పనిచేస్తున్నారని, జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో ప్రజలు, ప్రభుత్వానికి మధ్య అనుసంధాన కర్తలుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లో మూడు సార్లు కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. సామాన్యులు, పేదలకు ఎటు-వంటి నష్టం కల్గకుండా క్షేత్రస్థాయిలో భూ సంబంధ సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గారు ఎప్పుడూ చెబుతుంటారని, క్షేత్రస్థాయిలో పేదలు తమ భూములకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఈ తొమ్మిది నెలల కాలంలో రెవెన్యూ శాఖలో పలు సంస్కరణలు చేపట్టామన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన చీకటి చట్టం ల్యాండ్ -టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయడంతో పాటు-, ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక చట్టాన్ని, ఆర్ ఓ ఆర్ చట్టాలను తీసుకొచ్చామని తెలిపారు. ఆర్ ఓ ఆర్ చట్టాన్ని సవరించి అప్పీల్ అధికారాన్ని డీ ఆర్వో ల నుండి ఆర్డీవోకు మార్చాం. దీంతో భూ యజమానులకు త్వరగా వారి అప్పీళ్లు పరిష్కారమవుతాయని తెలిపారు. ప్రైవేటు- భూములు ఎట్టిపరిస్థితిలోనూ 22ఏ వివాదాల్లో ఉండకూడదన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. చాలా మందికి తమ భూమి ఎందుకు 22ఏ వివాదంలో ఉందో కూడా తెలీదన్నారు. జిల్లా కలెక్టర్లు కూడా జిల్లాల్లో భూ వివాదాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాలన్నాన్నారు. రెవెన్యూ శాఖలో భూ వివాదాలకు సంబంధించి ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు, అర్జీలను అన్నిటిని పరిష్కరిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను కూడా పరిష్కరిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రూ.700 కోట్లు- దుర్వినియోగం చేసి సర్వే రాళ్లపై బొమ్మలు వేసుకుంటే ఇప్పుడు వాటిని తొలగిస్తున్నామన్నారు. రైతులకు గతంలో ఎన్నడూ లేనివిధంగా పట్టాదారు పాసుపుస్తకాలను అత్యంత పారదర్శక విధానంతో అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో అన్ అబ్జెక్షనబుల్ ల్యాండ్స్ ఉన్న పేదలకు ఆ భూమిని క్రమబద్ధీకరించే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోందని, 22ఏ భూముల వివాదాల పరిష్కారంపైన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు-ందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వీటి కోసం ఒక ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని, దీనికి జిల్లా కలెక్టర్లు సహకారం అందివ్వాలని కోరారు. గత ప్రభుత్వం నిర్వహించిన రీ సర్వే తప్పుల తడకగా సాగింది. రీ సర్వేపైన గ్రామ సభలు పెట్టాం. ఆ తర్వాత రెవెన్యూ సదస్సులు నిర్వహించాం. వీటితోపాటు- పిజిఆర్ఎస్ లోనూ గ్రీవెన్స్ వస్తున్నాయి. వీటిల్లో 90 శాతం పరిష్కరించామని, వీటిని క్వాలీటీ డిస్పోజల్ చేయాలని ముఖ్యమంత్రి ఎప్పుడూ చెబుతుంటారు. కలెక్టర్లు ఆ దిశగా పని చేయాలన్నారు. రీ సర్వేను కూటమి ప్రభుత్వం చాలా పకడ్బందీగా చేస్తోంది. రోజుకు 20 ఎకరాల్లోనే చేస్తున్నాం. కొత్తగా పాసుపుస్తకం జారీ చేయడంతో పాటు-, దానికి జియోట్యాగింగ్ చేస్తున్నామని తెలిపారు. జిల్లాల్లో పలు చోట్ల భూములు కోర్టు కేసుల్లో ఉన్నాయని, ఇలాంటి కేసులు కూడా త్వరితగతిన పరిష్కరించడానికి జిల్లా కలెక్టర్లు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ప్లీడర్లతో సమావేశమై ఆ కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రజలు తమ భూముల సమస్యలకు సంబంధించి క్షేత్రస్థాయిలో అధికారుల వద్దకు వచ్చినప్పుడు వాటిని పరిష్కరించి న్యాయం చేయాలని, ఒకవేళ చేయలేకపోతే ఎందుకు చేయలేకపోతున్నామో చెప్పగలిగేలా ఒక స్పీకింగ్ నోట్ ఇచ్చే పరిస్థితికి చేరుకోవాలని కోరారు. ఎమ్మార్వో కార్యాలయాల్లో అధికారులు సిబ్బంది సిటిజన్ ఫ్రెండ్లీగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి వల్ల రాష్ట్రంలో పెట్టు-బడులు పెట్టడానికి ఎంతోమంది ముందుకు వస్తున్నారని, అయితే క్షేత్రస్థాయిలో ప్రభుత్వ ఫ్రీ హోల్డ్ భూములు ఎలాంటి వివాదాలు లేకుండా చూసుకోవాలన్నారు. వివాదాలుంటే పెట్టు-బడులపై ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదముంటుందన్నారు. దీనికోసం జిల్లాల్లో ప్రత్యేకించి ఒక రియల్ ఎస్టేట్ కమిటీ- ఏర్పాటు- చేసుకోవాలన్నారు. జిల్లా, రెవెన్యూ, మున్సిపాల్టీ, పంచాయతీ, పట్టణాభివృద్ధి సంస్థలు, బ్యాంకర్లు అందరూ ఈ కమిటీ-లో సభ్యులుగా ఉండేలా చూడాలన్నారు. ఈ కమిటీ- ప్రతి నెల లేదా రెండు నెలలకు ఒకసారి సమావేశమై ఆయా జిల్లాల్లో ప్రభుత్వ భూములకు సంబంధించి ఉన్న వివాదాలు పరిష్కరించాలని కోరారు.

# కమలనాథుల ఎన్నికల బడ్జెట్

న్యూఢిల్లీ,మన దేశంలో రాజకీయ పార్టీల ఎన్నికల ప్రణాళికల్లో సంక్షేమ పథకాలు, ఉచిత వరాలు ఎల్లప్పుడూ ఉంటుంటాయి. అయితే, అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయ పార్టీలు ఆ వాగ్దానాలను నెరవేర్చకపోయినప్పటికీ భారత్‌లో అవి ఎన్నికల ప్రచారంలో అంతర్భాగంగా మారిపోయాయి. గత ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలు ఉచితాల వాగ్దానాలు చేయడంలో ఒకదానిని మించి మరొకటి ముందుకు సాగాయి. 2020 నుంచి పిఎం గరీబ్ కల్యాణ్ యోజన ద్వారా 80 కోట్ల మందికి పైగా పౌరులు ఉచిత రేషన్లు అందుకుంటుండడం, పౌరుల బ్యాంక్ ఖాతాలకు నేరుగా రూ. 34 లక్షల కోట్లు బదలీ చేయడం, పిఎం ముద్ర యోజన కింద 46 కోట్ల మంది రూ. 27 లక్షల కోట్లు మేరకు రుణాలు పొందడం, 63 లక్షల మంది వర్తకులకు పిఎం స్వనిధి పథకం వర్తింపచేయడం వంటి అనేక ఉచిత వరాల పథకాల గురించి నిరుడు పార్లమెంటరీ ఎన్నికల్లో బిజెపి తన మేనిఫెస్టోలో ప్రధానంగా ప్రస్తావించింది.ఎన్నికలు జరగనున్న అసోం రాష్ట్రంలో 2025–26 రాష్ట్ర బడ్జెట్ ఊహించినట్లుగానే పూర్వపు సంక్షేమ పథకాల కొనసాగింపుతో పాటు అసంఖ్యాకంగా కొత్త ఉచితాలు, పథకాలపై దృష్టి కేంద్రీకరించింది. మొత్తం రూ. 2.63 లక్షల కోట్ల పెట్టుబడిలో నెలకు రూ. 15 వేల వరకు ఆర్జిస్తున్న వ్యక్తులకు వృత్తి పన్ను మినహాయింపు, రాష్ట్ర విశ్వవిద్యాలయాల పట్టభద్రులకు నెలకు రూ. 2500 గ్రాంట్, నెలకు 120 యూనిట్ల లోపు విద్యుత్ వాడుతున్న వినియోగదారులకు విద్యుచ్ఛక్తి రేట్లలో రూ. 1 తగ్గింపు, రాష్ట్రంలోని 6.8 లక్షల మంది తాత్కాలిక, శాశ్వత తేయాకు తోట కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 50 వేల వరకు ఏక విడత ఆర్థిక సహాయం, మహిళల స్వయం సహాయక బృందాల్లోని వ్యాపారవేత్తలకు మూలధనం సమకూర్చే పథకం వంటివి చేర్చారు.బిజెపి సారథ్యంలోని అసోం ప్రభుత్వం సాంఘిక సంక్షేమానికి గణనీయ ప్రాధాన్యం ఇవ్వడమే కాకుండా ఉచితాలు, ఆర్థిక సహాయం, లక్షిత బృందాలకు ప్రత్యక్ష ప్రయోజనాల ద్వారా తన ఓటర్ హితవిధానాలకు మరింత పుష్టి చేకూర్చింది.తేయాకు తోటల కార్మికులకు వేతనాలను పెంచడంతో పాటు బడ్జెట్‌లో తేయాకు తోటల కార్మికుల సంక్షేమానికి రూ. 342 కోట్లు కేటాయించడం, 6.8 లక్షల మంది శాశ్వత, తాత్కాలిక తేయాకు తోటల కూలీలకు రూ. 5000 మేరకు ఏక విడత ఆర్థిక సహాయం సమకూర్చుడం వంటివి ఉన్నాయి. 'అన్న సేవ సే జన్ సేవ' పథకం కింద, 2025 అక్టోబర్ నుంచి రూ. 25 ధరకు కిలో ఎర్ర కందిపప్పు, రూ. 20 ధరకు కిలో చక్కెర, రూ. 10 ధరకు కిలో ఉప్పు సహా సబ్సిడీ ధరలకు అత్యవసర ఆహార సరకులు సరఫరా చేస్తారు. అదనంగా, రూ. 300 కోట్ల లక్షిత సబ్సిడీ కార్యక్రమం గృహ కేటగిరీ, జీవన్ ధార వినియోగదారులకు యూనిట్‌కు రూ. 1 వంతున విద్యుత్ ఖర్చులు తగ్గిస్తారు. కొత్త స్మార్ట్ మీటర్ విధానం పట్ల జనంలో ఒకింత అసమ్మతి వ్యక్తం అయినందున ఎన్నికలకు ముందే దానిని అమలు చేస్తారు. రైతులు మార్కెట్ ధరలను మించి ధాన్యం, మొక్కజొన్న పంటలకు క్వింటాల్‌కు రూ. 250 మేరకు, ఆవాలకు క్వింటాల్‌కు రూ. 500 మేరకు బోనస్ పొందుతారు. అదనంగా 500 రైతు ఉత్పత్తిదారు సంస్థలు (ఎఫ్‌పిఒలు) ఒక్కొక్కటి వ్యవసాయ వాణిజ్యం, ఉమ్మడి సేద్యం ప్రోత్సాహం నిమిత్తం ముఖ్యమంత్రి ఉత్కర్ష్ యోజన కింద రూ. 10 లక్షలు అందుకుంటాయి.తరతరాల సామూహిక సేద్యం నుంచి మళ్లడానికి రాష్ట్రం నిరాకరణకు ఇది మరొక సూచిక. ఉదాక్సిన్ భకత్స్ పథకం సాంప్రదాయక మత నాయకులకు నెలకు రూ. 1500 సమకూరుస్తుంది, ఇక అస్సాం దర్శన్ పథకం 17 వేలకు పైగా మత సంస్థలు, 25 వేల నామ్‌ఘర్‌లకు రూ. 3 లక్షలు మంజూరు చేస్తుంది. సాంఘిక భద్రతను విస్తరిస్తూ ఒరుణోదయ్ 3.0 ఇప్పుడు 37.2 లక్షల మంది లబ్ధిదారులకు వర్తిస్తుంది. కుటుంబం సుస్థిరత సాధనకు నెలవారీ ఆర్థిక సహాయాన్ని ఇది అందజేస్తుంది. జాతీయ వితంతు పింఛన్ పథకం కింద వితంతువులుకూడా ఒరుణోదయ్ లబ్ధిదారులతో సమానంగా ప్రయోజనాలు పొందుతారు.ఇతర రాష్ట్రాల నుంచి అసోంకు మృతుల రవాణా ఖర్చులు భరించడం ద్వారా వారి గౌరవానికి భంగం వాటిల్లకుండా చూడాలని కూడా ప్రభుత్వం యోచిస్తోంది. అది పవిత్ర భావన అయినప్పటికీ ఆచరణ సాధ్యంకాని, ఆర్థికంగా ప్రశ్నార్థకమైన విధానం. అది అభివృద్ధి అవసరాల



నుంచి సార్వత్రిక నిధులను మళ్లించడమే అవుతుంది. అయితే, అత్యంత అసంబద్ధ ప్రకటన ఏమిటంటే నిరుద్యోగులకు ఉచితాల కల్పన పథకం. 'ఉద్యోగ అన్వేషకులకు సాయం' నిమిత్తం ఒక సంవత్సరం వరకు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు చెందిన 2025 పట్టభద్రులకు నెలకు రూ. 2500 వంతున సమకూర్చాలన్నది ముఖ్యమంత్రి జీవన్ ప్రేరణ పథకం లక్షం.గౌహతి హైకోర్టు నిరుడు అక్టోబర్‌లో ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రశ్నించింది. రెండు సంవత్సరాల క్రితం చేసిన పనికి ఒక కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లించకుండా ఉచితాలు అందజేస్తున్నందుకు అసోం ప్రభుత్వాన్ని హైకోర్టు విమర్శించింది. సుమారు రెండు సంవత్సరాల క్రితం పూర్తి చేసిన పనికి తనకు రావలసి ఉన్న బిల్లులను చెల్లించనందుకు పిటిషనర్ రిషి గుప్తా దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కోర్టు విచారిస్తూ ఆ వ్యాఖ్య చేసింది. అంతకుముందు ఒక ఉత్తర్వులో కోర్టు 2024 సెప్టెంబర్ 30 నాటికల్లా పెండింగ్ బకాయిలు తీర్చాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'ఉచితాల' చెల్లింపునకు అసోం ప్రభుత్వ శక్తిపై న్యాయమూర్తి అపనమ్మకం వ్యక్తం చేస్తూనే కాంట్రాక్టర్‌కు చెల్లింపులు జరపకపోవడాన్ని నిలదీశారు. 25 వేల మంది తొలిసారి వ్యాపారవేత్తలకు రూ. 75 వేల గ్రాంట్ చెల్లింపునకు సంబంధించిన మీడియా వార్తలను ఆయన ఉటంకించారు. నిధుల కొరత గురించి ఒక వైపు మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం మరొక వైపు అటువంటి పథకాలను ఎలా అమలుపరుస్తోందని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ, ప్రాధాన్యతలలో వైరుధ్యాన్ని ఆయన ఎత్తిచూపారు.నిరుద్యోగిత సమస్య పరిష్కారానికి ఏమాత్రం ప్రయత్నించకుండా ఎన్నికల ప్రాధాన్య ఉచితాల ప్రకటనకు ఇది ఒక మచ్చుతునక. ఉద్యోగార్థులకు అండగా నిలిచే పథకంగా పేర్కొంటూనే నైపుణ్యాభివృద్ధిని లేదా క్రియాశీలక ఉద్యోగాన్వేషణను ప్రోత్సహించడం కన్నా ఆధారపడడాన్ని ఇది పెంపొందిస్తోంది. తాత్కాలికంగా నగదు పంపిణీతో ఉద్యోగాల సృష్టికి గాని, ఉద్యోగార్హతకు గాని ఇది దోహదం చేయదు. దానికి బదులు సమస్యను మరింత ఆలస్యం చేస్తుంది. అదే సమయంలో రాష్ట్రంపై దుర్భరమైన ఆర్థిక భారాన్ని మోపుతుంది. అసోం బడ్జెట్ 202526 రాష్ట్ర ప్రభుత్వ విభజనవాద అజెండాను ప్రతిబింబిస్తోంది. 'స్వదేశీయుల పరిరక్షణ' పేరిట ముస్లింలను, ముఖ్యంగా బెంగాలీ మాట్లాడే ముస్లింలను అది లక్షంగా చేసుకుంటున్నది. వారికి భూమి అమ్మకంపైన ఆంక్షలు విధించడం, ఖాళీ చేయించడం, పునరావాస విధానాలు రూపొందించడం వంటివి ప్రభుత్వం అనుసరిస్తోంది. హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా హిందువుల ఓట్లు మరింతగా సమీకరించేందుకు రాష్ట్ర బిజెపి ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌ను ఉపయోగించుకున్నది.వ్యక్తుల మధ్య అంతర్ మత భూమి బదలీల కేసులు అన్నిటినీ 'రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం తరువాతే అమలులోకి తీసుకువస్తాం' అని ఆర్థిక శాఖ మంత్రి అజంత నియోగ్ ప్రకటించారు. బడ్జెట్ ప్రతిపాదన అనంతరం అసోం సిఎం శర్మ మీడియాతో మాట్లాడుతూ, అసోం అత్యంత సున్నిత రాష్ట్రం అయినందున అన్ని రకాల మత కల్లోలాల నివారణకు ప్రభుత్వం భూముల అంతర్ మత బదలీని నిరుడు నిషేధించిందని తెలియజేశారు. అటువంటి నిషేధాలు రాజ్యాంగం ప్రకారం కొనసాగజాలవని సిఎంకు తెలుసు. ప్రభుత్వం ఇప్పుడు అంతర్ మత భూముల క్రయవిక్రయాలను అనుమతించిందని, అయితే, ప్రతి ప్రతిపాదనను తాము

# దిగుమతులపై ఆధారపడితే ముప్పే

న్యూఢిల్లీ,ప్రపంచ సరకుల మార్కెట్లలో రష్యాది ప్రధాన పాత్ర కావడంతో అక్కడి కుదుపులన్నీ మనపై ప్రభావం చూపక మానవు. ప్రపంచంలోకెల్లా అతి పెద్ద సహజవాయు ఎగుమతిదారు రష్యా. రెండో అతి పెద్ద చమురు ఎగుమతిదారూ ఆ దేశమే. ఆ దేశ జీడీపీలో అయిదోవంతు వీటి పుణ్యమే. ప్రపంచ చమురు దిగుమతుల్లో 12 శాతం రష్యా నుంచే వస్తాయి. ఉక్రెయిన్‌పై రష్యా దాడి మొదలైనప్పటి నుంచి ముడి చమురు ఫ్యూచర్లు 26 శాతం పైగా పెరిగాయి. గత డిసెంబర్‌లో బ్యారల్ 70 డాలర్లున్న అంతర్జాతీయ ముడి చమురు ధర ఇప్పుడు దాదాపు రెట్టింపు అయింది. చమురు అవసరాల్లో 85 శాతానికి దిగుమతులపైనే ఆధారపడ్డ దేశం మనది. ఇప్పుడిక ముడిచమురు దిగుమతి ఖర్చు భారీగా పెరుగుతుంది. చమురు కోసం రష్యాపై ఆధారపడ్డ పాశ్చాత్య దేశాలు తంటాలు పడుతున్నాయి. చమురు ధరల కారణంగా పెరిగే ఆ ఖర్చు ప్రభావం సరకుల రవాణా మీద పడుతుంది. సరకుల రేట్లకు రెక్కలొస్తాయి. ఆహార ధరలు పెరుగుతాయి. గోధుమలు, మొక్కజొన్న, బార్లీ ప్రపంచ ఎగుమతుల్లోనూ రష్యా, ఉక్రెయిన్లది గణనీయమైన పాత్ర. వాటి రేట్లూ పెరుగుతున్నాయి. మన ఎరువుల దిగుమతుల్లో దాదాపు 17 శాతం పొటాష్, 60 శాతం ఎన్పీకే ఎరువులు రష్యావే. ఈ క్రమంలో దిగుమతులపై ఆధారపడ్డ మనం ధరల దాడిని ఎదుర్కోవాల్సి వస్తోంది.

# పథకాల సమర్ధ అమలుకు చర్యలు

అమరావతి,సంక్షేమ అభివృద్ధి పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేయడం ద్వారా నిర్దేశిత లక్ష్యాల సాధనకు కలెక్టర్లకు తగిన దిశానిర్దేశర చేయడం జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అన్నారు. అదే విధంగా ఆయా పథకాలు, కార్యక్రమాలపై పూర్తి అవగాహన కల్పించేందుకు ఈరెండు రోజుల సమావేశంలో కృషి చేయడం జరిగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు- జరిగే కలెక్టర్ల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా నిర్దేశిరచుకున్న లక్ష్యాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్లకు దిశా నిర్దేశనర చేయడం జరుగుతుందని తెలిపారు. వివిధ పథకాలు, కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి లేదా ముఖ్య కార్యదర్శి లేదా కార్యదర్శి స్థాయి అధికారిని జిల్లా ఇన్చార్జి గా నియమించడం జరిగిందని చెప్పారు. ఈసమావేశంలో జిల్లాల వారీగా జిల్లా కార్యాచరణ ప్రణాళికల గురించి కలెక్టర్లు ప్రెజెంటేషన్ ఇస్తారని సిఎస్ చెప్పారు.అదే విధంగా వాట్సాప్ గవర్నెన్స్,గ్రీవియెన్స్ రిడ్రస్సల్ విధానం, భూ సంబంధిత అంశాలు,సమ్మర్ కార్యాచరణ ప్రణాళికపై చర్చించడం జరుగుతుందని అన్నారు. పియం సూర్య ఘర్ పథకం కింద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 10 వేల రూఫ్ టాప్ సోలార్ విద్యుత్ తయారీ యూనిట్లు- ఏర్పాటు- చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని ఆలక్ష్య సాధనకు కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.అంతేగాక వివిధ ఉత్తమ విధానాలను అవలంభించడం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలని కలెక్టర్లకు సిఎస్ స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో రెండు రోజుల పాటు- జరుగనున్న 3వ జిల్లా కలెక్టర్ల సమావేశం ప్రారంభమైంది.ఈసమావేశంలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్,డిజిపి హరీశ్ కుమార్ గుప్తా,వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,ముఖ్య కార్యదర్శులు,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తజన ప్రవాహం

నంద్యాల : భానుడు భగభగ మండుతున్నాడు. దప్పికతో గొంతు ఎండిపోతోంది. రాత్రి లేదు.. పగలు లేదు. అడవిలో కాలినడకతో అష్టకష్టాలతో పని లేదు. కానీ తమ పుట్టినింటి ఆడబిడ్డను దర్శించుకోవాలి. ఆమె నుదుటిన మిరియాల బొట్టు దిద్దాలి. గాజులు తొడిగి చీరెసారెలు సమర్పించాలి. అప్పుడు కలిగే దివ్యానుభూతి వర్ణనాతీతం. ఇదీ శ్రీశైలంపై వేంచేసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో కన్నడ భక్తుల అనుభూతి. ఉగాది పర్వదినం సందర్భంగా నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఈనెల 27నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీశైలం దివ్యక్షేత్రానికి తరలి వస్తున్నారు. మరీ ముఖ్యంగా నల్లమల అడవి మార్గంలో కాలినడకన భక్త జనజాతర కనువిందు చేస్తోంది.

ఆడపడుచుకు సారె సమర్పణకు

%అపర శబరిమలైగా పేరొందిన శ్రీశైలం పుణ్యక్షేత్రంలో తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజున .. శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామిని ప్రత్యేకంగా దర్శించుకునేందుకు కన్నడ భక్తులు తండోపతండాలుగా తరలిరావటం విశేషం. వీరందరూ కాలినడక మొక్కుతో శ్రీశైలం చేరుతారు. ఇందుకు ఓ ప్రత్యేకత ఉంది. పురాణ శాస్త్రం ప్రకారం, శ్రీ భ్రమరాంబిక దేవీ కన్నడిగుల ఆడపడుచు. తమ ఇంట్లో అఖండ దీపం వెలిగించి.. పిల్లాజెల్లా.. చిన్నా పెద్ద, ఆడమగ ఇలా ఇంటిల్లిపాది నెలరోజుల పాటు కాలినడకన శ్రీశైలం చేరుకుంటారు. అడవి మార్గంలో మల్లన్న, భ్రమరాంబికను తలచుకుంటూ ఆలయానికి చేరుతారు. ఇక్కడ శ్రీ భ్రమరాంబికను దర్శించుకుని.. తొలుత మిరియాల బొట్టు పెడతారు. దీంతో భ్రమరాంబికకు అంటిన మరక పోతుందని కన్నడిగుల నమ్మకం. ఇక గాజులు, చీరె సారెలు సమర్పిస్తారు. ఇలా ఆది దంపతుల దర్శనం అనంతరం తిరిగి తమ ఇళ్లకు చేరుతారు. ఇలా తమ పుట్టినింటి ఆడపడుచుకు చీరెసారెలు సమర్పించటం కన్నడిగుల ఆచారం, సంప్రదాయం. ఈ ప్రత్యేక పూజలే ఆనవాయితీగా భావిస్తారు. ఇక ఇంట్లో అఖండ దీపం వెలుగుతూనే ఉంటే.. తమ కష్టాలు తీరినట్టేనని సంబరం చేసుకొంటారు.

కన్నడిగుల జాతర..

%తమ పుట్టింటి ఆడపడుచు శ్రీ భ్రమరాంబిక దేవీకి తమ ఊరి నుంచి పసుపు కుంకుమ, గాజులు, చీరెసారెలు సమర్పించటానికి కన్నడిగులు బయలుదేరారు. కర్ణాటక రాష్ట్రం నుంచి వీరు కాలినడకన వివిధ ప్రాంతాల్లో గుంపులు గుంపులుగా కలిసి.. కర్నూలు, నందికొట్కూరు, ఆత్మకూరు పట్టణాల మీదుగా వెంకటాపురం వరకు కాలినడకన చేరారు. మధ్య మధ్యలో వీరికి ఉచితంగా భోజనాలు, దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ, తాగునీరు తదితర సదుపాయాలను దాతలు కల్పించారు. మధ్య మధ్యలో వైద్య శిబిరాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది.వెంకటాపురం నుంచి నల్లమల అటవీ ప్రాంతంలో దాదాపుగా 45 కిలోమీటర్లు వేసవిని సైతం లెక్కచేయకుండా మండుటెండల్లో పుట్టింటి ఆడపడుచు భ్రమరాంబికా దేవి మల్లికార్జున స్వామి నామస్మరణలతో ముందుకు సాగిపోతున్నారు. నల్లమల్ల అటవీ ప్రాంతంలో రాత్రి పగలు తేడా లేకుండా పాదయాత్ర చేయటం కన్నడ భక్తుల ప్రత్యేకత. కన్నడిగులు భక్తి పారవశ్యంతో ఊత కర్రల సాయంతో పాదయాత్ర చేస్తున్నారు. అలుపు సొలుపు లేకుండా నడవటం తమకు భ్రమరాంబిక ఇచ్చిన వరంగా భావిస్తామని కన్నడికులు పేర్కొన టం విశేషం. ప్రస్తుతం శ్రీశైలం దేవస్థానం కన్నడిగుల తో కళకళలాడుతోంది.

# ఇంతవరకు రాజధానిలేని రాష్ట్రంగా ఏపీ

అమరావతి,రాష్ట్ర విభజన జరిగి సుమారు తొమ్మిదేళ్లు అవుతున్నా ఇంకా ఏపీకి రాజధాని లేదని, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రాజధాని నిర్మాణం మరింత ఆలస్యమైందని మంత్రి నారాయణ అన్నారు. ఏపీ రాజధాని అమరావతిలో నారాయణ మంగళవారం పర్యటించారు. ఇప్పటికే పలు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. నిర్మాణంలో ఉన్న కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల బంగ్లాలను, సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ఏ రాష్ట్రానికి అయినా రాజధాని అవసరమని, ప్రస్తుతం రాజధాని లేని రాష్ట్రం ఏపీ మాత్రమేనని అన్నారు. గత టీడీపీ హయాంలో రూ. 43 వేల కోట్లకు టెండర్లు పిలిచామని, అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఆల్ ఇండియా సర్వీస్ భవనాలు దాదాపు పూర్తయ్యాయని తెలిపారు. కానీ గత ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోలేదని మంత్రి నారాయణ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా అనేక ఇబ్బందులు వచ్చాయన్నారు. ఐఐటీ మద్రాస్‌ను పిలిచి బిల్డింగ్ నాణ్యత పరిశీలించి, కాంట్రాక్టర్లతో చర్చించి కొన్ని సమస్యలు పరిష్కరించామన్నారు. 90 శాతం పనులు టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. మొదట క్లీనింగ్‌తో పనులు మొదలు అయ్యాయన్నారు. ఇవాళ సెక్రెటరీ.. ప్రిన్సిపాల్ కార్యదర్శి బంగళాలు పరిశీలించామన్నారు. 186 బంగాళాలు మంత్రులు, జడ్జీలు, కార్యదర్శులు ప్రధాన కార్యదర్శులకు వస్తున్నాయన్నారు. గెజిటెడ్ అధికారులకు 1440,ఎన్జీవోలకు 1995 నిర్మాణాలు వస్తున్నాయని తెలిపారు. అలాగే హై కోర్ట్ 16.85 లక్షల చదరవు అడుగులు వస్తుందన్నారు. అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో ఉంటుందని, 15 రోజుల్లో కాంట్రాక్టర్ల మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని నారాయణ తెలిపారు. ప్రజలపై ఒక్క పైసా భారం కూడా లేకుండా రాజధాని నిర్మాణం పూర్తి అవుతుందని, వరల్డ్ బాంక్.. ఎడిబి నుంచి రుణాలు తీసుకున్నామని మంత్రి నారాయణ తెలిపారు. ల్యాండ్ వాల్యూ పెరిగిన తర్వాత. అప్పు తీర్చడం జరుగుతుందన్నారు. ప్రజల డబ్బు వృధా చేస్తున్నారని ప్రతిపక్షం చెబుతోందని.. ఇది సరికాదని మంత్రి అన్నారు. మరోవైపు విశాఖ జిల్లా, భోగాపురం ఎయిర్ పోర్ట్ రోడ్ల వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తాయని మంత్రి నారాయణ అన్నారు. ఇందుకోసం రోడ్ల విస్తరణ చేయాల్సి ఉందని అన్నారు. ఈ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా ఎక్కువగా ఉందని తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కనెక్టివిటీ, ఇతర ట్రాఫిక్ సమస్యలపై నాలుగు రోజుల క్రితం విశాఖ స్థానిక నేతలతో చర్చించామన్నారు. వీఎంఆర్డీఏ పరిధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష చేశామని తెలిపారు. ఫైనల్ చేసిన మాస్టర్ ప్లాన్‌ను ఆన్‌లైన్‌లో ఉంచుతామని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ప్రజల నుంచి అభిప్రాయం తీసుకుని మాస్టర్ ప్లాన్ నాలుగు నెలల్లో ఫైనల్ చేస్తామని మంత్రి నారాయణ ప్రకటించారు. మాస్టర్ ప్లాన్ అంటే రాబోయే 30 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని చేయాలని చెప్పారు. కొన్ని చోట్ల రోడ్ల పరిధిని పెంచడంపై అధికారులతో చర్చించినట్లు చెప్పారు. మెట్రో రైల్ కూడా మాస్టర్ ప్లాన్‌లో భాగమేనని తెలిపారు. 8 క్రాస్ రోడ్ల దగ్గర ఫ్లై ఓవర్లు ఉన్నాయని చెప్పారు. ఇక్కడ డబుల్ డెక్కర్ రోడ్లు ప్లాన్ చేసేలా ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను చెప్పారని అన్నారు. టీడీఆర్ బాండ్ల విషయం అందరికీ తెలుసునని.. టీడీఆర్ బాండ్లపై అన్ని మున్సిపాలిటీల్లో స్పెషల్ డ్రైవ్ జరుగుతోందని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలు పరిష్కారం అవుతాయని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

# భారీగా ప్రోత్సాహకాలు...

న్యూఢిల్లీ, ప్రస్తుతం అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నపెట్రోల్, డీజిల్ ధరలతో వాహనదారులకు మరింత భారంగా మారుతోంది. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన ఆగత్యం ఏర్పడింది. ఎలక్ట్రిక్ వాహనాల ఆవశ్యకత పెరిగింది. ముఖ్యంగా వాహనాల ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో పలు వాహనాల తయారీ కంపెనీలు ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకువస్తున్నాయి. దీంతో వాహనదారులు కూడా ఎలక్ట్రిక్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. తయారీదారులను ప్రోత్సాహించాని కేంద్రం కూడా ఆలోచిస్తోంది. రిజిస్ట్రేషన్ ఛార్జీలను గణనీయంగా తగ్గిస్తున్నాయి. ఇది అమల్లోకి వస్తే రానున్న రెండు మూడేళ్లలో ఈ తరహా వాహనాలకు గిరాకీ పెరగ గనుంది. కేంద్ర ప్రభుత్వం కాలుష్యానికి కారణమవుతున్న పెట్రోల్, డీజిల్ వాహనాలను తగ్గించి కేవలం ఎలక్ట్రిక్ వాహనాలనే నడపాలని భావిస్తోంది. ఇందుకోసం ఓ భారీ ప్రణాళిక సైతం రచించింది. ఇప్పటికే చాలా మంది పెట్రోల్, డీజిల్ ధరలు పెరుగుతుండటంతో ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముందుగా ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అందుబాటులోకి రాగా, కార్లు కూడా వచ్చేస్తున్నాయి. ఇక రానున్న రోజుల్లో ఎలక్ట్రిక్ వాహనాలు ధరలు తగ్గనున్నాయని కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్లు కూడా అధిక మొత్తంలో ఏర్పాటు అయ్యేందుకు అనుమతులు కూడా మంజూరు చేసినట్లు తెలిపారు. వచ్చే రెండేళ్లలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు సమానంగా ఎలక్ట్రిక్ వాహనాల ధరలు ఉంటాయని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు పెద్దగా లేవు. ధరల విషయంలో పలు డిస్కౌంట్లు, ఆఫర్లు చేస్తోంది ప్రభుత్వం. భారత్‌లో భారీ మొత్తంలో ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకువచ్చేందుకు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. దీంతో వాహనాల ధరలు దిగి వస్తాయని మంత్రి తెలిపారు. ఇక ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వస్తుండటంతో ఛార్జింగ్ స్టేషన్లు కూడా భారీగా ఏర్పాటు కానున్నాయి. ఫేమ్ ఇండియా స్కీమ్ ఫేస్ 2 కింద 16 జాతీయ రహదారులు, 9 ఎక్స్‌ప్రెస్‌వేలపై 1576 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌లను మంజూరు చేసింది కేంద్ర మంత్రిత్వశాఖ. జాతీయ రహదారుల వెంట ఇరు వైపులా ప్రతి 25 కిలోమీటర్ల దూరంలో ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు కానుంది. అలాగే హేవీ డ్యూటీ వెహికిల్స్ కోసం జాతీయ రహదారులపై ప్రతి 100 కి.మీలకు ఇరు ఒక ఛార్జింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తోంది. వీటిలో 266 ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్లను ఏపీలోని రహదారులపై, తెలంగాణలో 138 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్టు భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ గతంలోనే ప్రకటించింది. ఇందులో భాగంగా 25 రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 68 నగరాలలో 2,877 ఛార్జింగ్ స్టేషన్‌లు మంజూరు చేసింది. ఇవి పక్కాగా అమలు చేస్తే ఇంధనల ధరలపై పెట్టుబడులు పెట్టాల్సిన ఆగత్యం ఉండదు. అలాగే ధరల భయం కూడా ఉండదు.

# పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్,గ్రూప్-1 అభ్యర్థులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలంటూ హైకోర్టులో అభ్యర్థులు పిటిషన్ వేశారు. మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగిందని పిటిషనర్లు తెలిపారు. 18 రకాల సబ్జక్టులుంటే 12 సబ్జక్టుల నిపుణులతోనే దిద్దించారన్నారు. 3 భాషల్లో పరీక్ష జరిగినా తగిన నిపుణులతో దిద్దించలేదని వెల్లడించారు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో రెండు భాషల పేపర్లు దిద్దించచారని.. దీంతో మూల్యాంకణంలో నాణ్యత కొరవడిందన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గాను.. గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు గ్రూప్-1 పరీక్షలు జరిగాయి. ఈ మెయిన్స్‌కు 21,093 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

# లోటస్ మార్క్ లుకలుకలు.. కేంద్రం మొట్టికాయలు




హైదరాబాద్, పిట్ట కన్నుపై నేరుగా గురి పెట్టాలి. అంతే కానీ అది వాలిన చెట్టు మీద పుట్ట మీద కాదన్న మాట వినే ఉంటాం. ప్రెజెంట్ తెలంగాణ బీజేపీ పరిస్థితి కూడా సరిగ్గా ఇలాగే ఉందని తీవ్రంగా ఫీలవుతోందట కేంద్ర అధినాయకత్వం. ఎక్కడో ఉన్న తాము గుర్తించిన మేరకు కూడా స్థానిక నాయకత్వం లోకల్ ప్రాబ్లెమ్స్ మీద ఫోకస్ పెట్టడం లేదన్న టాక్ వినిపిస్తోంది. ఇక్కడి నుంచి మేము ఇది చేస్తాం అది చేస్తామంటూ.. నివేదికలు వెళ్లాల్సింది పోయి.. అక్కడి నుంచి మీరది చేయడం లేదు ఇది చేయడం లేదన్న మొట్టికాయలు పడుతున్నాయట. అంతగా స్టేట్ లోటస్ పార్టీ లుక లుకలేంటి? కేంద్ర నాయకత్వం ఏ విషయంలో రాష్ట్ర కమలనాథులపై గుర్రుగా ఉన్నారు? ఆ డీటైల్స్ ఏంటి? హ్యావే లుక్.

తెలంగాణ బీజేపీలో గ్రూప్ తగాదాలు

అధిష్టానం వీరినెలా గాడిన పెడతారన్న విషయమై ఉత్కంఠతెలంగాణ బీజేపీలో గ్రూప్ తగాదాలు తారా స్థాయికి చేరుకున్నాయట. పార్టీలో గ్రూప్ పాలిటిక్స్ పై అధిష్టానం కన్నెర్ర చేస్తోందట. రాష్ట్ర పార్టీలో జరుగుతున్న పరిణామ క్రమాలపై ఢిల్లీ కి గట్టి రిపోర్టులే వెళ్లాయట. దీంతో అమిత్ షా, నడ్డా రాష్ట్ర నేతలకు దిమ్మ తిరిగే క్లాసులైతే పీకారట.

రాజాసింగ్ రూపంలో మరో హెడ్డేక్

ఇప్పటికే పార్టీలో ఉన్న ఎంపీలు, ఎమ్మెల్యేల్లో ఒకరంటే ఒకరికి పడని పరిస్థితి. మీలో మీకే గ్రూపు తగాదాలున్నాయని ఇటు కాంగ్రెస్ అటు బీఆర్ఎస్ పార్టీలు పెద్ద ఎత్తున ఆరోపిస్తున్నాయి కూడా. ఉన్న తలనొప్పులు చాలవన్నట్టు రాజా సింగ్ రూపంలో ఉన్న హెడ్డేక్ ఎన్ని శారిడాన్ మాత్రలు వేసుకున్నా తగ్గని దుస్థితి. ఆయనసలు రాష్ట్ర పార్టీగానీ కార్యాలయంగానీ పట్టకుండా పేరలల్ గా పార్టీ నడుపుతున్నట్టు ఏకంగా పేపర్లు, టీవీల్లో పతాక శీర్షికలకు ఎక్కడంతో ఇదెక్కడి గొడవో అర్థం కావడం లేదని వాపోతున్నారట సగటు కమలం పార్టీ కార్యకర్తలు.

గ్రూప్ పాలిటిక్స్ ఆపకుంటే సర్జికల్ స్ట్రైక్స్ తప్పవని హెచ్చరిక

ఎప్పుడైతే రాజా సింగ్ దాదాపు సొంత కుంపటి పెట్టినంతగా రెచ్చిపోతున్నారో.. కాంగ్రెస్, బీఆర్ఎస్ లకు చేజేతులా.. ఆయుధాలు సప్లై చేసినట్టు అవుతోందట. ఇదే పెద్ద సమస్య అనుకుంటే.. గ్రూప్ పాలిటిక్స్ కారణంగా పార్టీకి భారీ ఎత్తున డ్యామేజీ జరుగుతోన్నట్టు కేంద్ర నాయకత్వం ఫిక్సయ్యిందట. ఒక వేళ మీరుగానీ.. మీ తీరుగానీ మార్చుకోకుంటే.. సర్జికల్ స్ట్రైక్స్ తప్పవని హెచ్చరించినట్టు తెలుస్తోంది.

2018 నాటికీ 2023 నాటికీ స్టేట్ బీజేపీలో చాలానే తేడా

2018 ఎన్నికల నాటి సీన్ కి.. 2023 ఎన్నికల తర్వాతి నాటి సీన్ కీ తెలంగాణ బీజేపీలో చాలానే తేడా. అప్పట్లో ఒక్కడంటే ఒక్కడిగా.. రాజాసింగ్ రూపంలో ఉన్న అసెంబ్లీ సీట్ సీనేరియో.. తాజాగా ఎనిమిది మందికి ఎగబాకింది. ఇక ఎంపీల్లో కూడా అష్టదిగ్గజాల్లా..ఎనిమిది మంది లోక్ సభలో ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరితో పాటు.. ఇద్దరు కేంద్ర మంత్రులు బండి, కిషన్ రూపేణా.. రాష్ట్ర బీజేపీకి ఫ్లాగ్ షిప్- లీడర్షిప్ మెయిన్ టైన్ చేస్తున్నారు కూడా. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కమలం పార్టీ విజయ బావుటా ఎగుర వేయటంతో.. ఏకంగా ప్రధాని మోడీ నుంచే ప్రశంసల వర్షం కురిసిన పరిస్థితులు.వచ్చే స్థానిక ఎన్నికలకు పార్టీని సమాయిత్తం చేసి.. చాపకింద నీరులా మరింత ముందుకెళ్లాలనుకుంటే.. ఈ గ్రూపు తగాదాలేంటో అర్థం కావడం లేదని వాపోవడం.. బీజేపీ అగ్రనాయకత్వానికి అతి పెద్ద సవాలుగా నిలుస్తోందట.

కాంగ్రెస్ కి బీఆర్ఎస్ కాదు బీజేపీ ప్రత్యామ్నయం అన్న సంకేతాలనిస్తోన్న గణాంకాలు

ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితుల ప్రకారం చూస్తే.. కాంగ్రెస్ కి ప్రత్యామ్నాయం బీఆర్ఎస్ కాదు బీజేపీ.. అన్న సంకేతాలనిస్తోంది బీజేపీ గణాంకాల పట్టిక. అంతగా బీఆర్ఎస్ కుదేలయ్యి కూర్చుంది. ఈ సిట్యువేషన్లో.. స్థానిక బీజేపీ నేతలు కుదురుగా ఉండాలన్నది పై నుంచి అందుతున్న సందేశాల సారాంశం. కానీ ఇక్కడ వీరు మాత్రం.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు బృందగానాలు వినిపిస్తున్నారట. దీంతో ఢిల్లీ పెద్దలు తెలంగాణ బీజేపీ పని తీరు పట్ల తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.

రిజర్వేషన్ల అంశంలో ఫుల్ కన్ ఫ్యూజన్లో రాష్ట్ర బీజేపీ

రిజర్వేషన్ల అంశంపై బీజేపీ రాష్ట్ర నాయకత్వం ఫుల్ కన్ ఫ్యూజన్లో ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వైపు మతపరమైన రిజర్వేషన్లను వ్యతిరేకిస్తోంది బీజేపీ. అసెంబ్లీ సాక్షిగా.. ఈ అంశాన్ని లేవనెత్తడంలో.. లోకల్ లోటస్ గ్యాంగ్ మొత్తం ఫెయిల్ అయ్యిందనే టాక్ నడుస్తోంది.

ఆ 42 శాతం రిజర్వేషన్లు ముస్లిమ్స్ ని కలుపుకునా? కలకుండానా?

తాజా తెగని పంచాయితీ ఏంటంటే.. ముస్లిమ్స్ ని కలుపుకుని బీసీ రిజర్వేషన్లు 42 శాతం ఇచ్చారా? లేక 10 శాతం ముస్లిం రిజర్వేషన్లను తీసేసి.. బీసీలకు 42 శాతం ఇచ్చారా? ఇటు బీజేపీ ఎమ్మెల్యేలకే కాదు అటు ఎంపీల కూడా ఒక క్లారిటీ లేనేలేదట. అంతే కాదు రాష్ట్ర నాయకత్వంలోనే అగ్ర నేతలుగా పేరున్న వారికి కూడా ఈ విషయంలో ఒక స్పష్టత లేదట. 10 శాతం రిజర్వేషన్లపై ఎమ్మెల్యేలంతా ప్రభుత్వాన్ని నిలదీయటంలో ఎందుకు విఫలమయ్యారనే చర్చ ఇందుకు అదనం. ఈ అంశాన్ని సభలో కనీసం ప్రస్తావించక పోవడమేంటి? అన్న విషయమై అధిష్టానం ఆరా తీసినట్టు సమాచారం.

కిషన్ రెడ్డిని టార్గెట్ చేసిన ఎమ్మెల్యేల కామెంట్

అయితే ఈ విషయంలో కేంద్రానికి మరో రకమైన సమాధానాలు వెళ్లాయట. రాష్ట్ర నాయకత్వం నుంచి తమకు సరైన గైడెన్స్ లేదని ఎమ్మెల్యేలు ఉల్టా బనాయించారట. దీంతో వీరెంత ఇన్ డైరెక్టుగా అన్నా.. అది నేరుగానే కిషన్ రెడ్డిని టార్గెట్ చేసిందట. ఏది ఏమైనా.. రిజర్వేషన్లపై ప్రభుత్వం నుంచి ఒక స్పష్టత రాకుంటే.. సోమవారం నుంచి ప్రభుత్వ కుట్రను అడ్డుకునేలా పోరాడుతామని పార్టీ పెద్దలకు హామీ ఇచ్చారట బీజేపీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి.

సోమవారం నుంచి ప్రభుత్వ కుట్ర అడ్డుకుంటామన్న ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి

అయితే ఇలాంటి కంటి తుడుపు చర్యలతో పెద్దగా ప్రయోజనం లేదన్న మాట కూడా ఇంతే స్థాయిలో వినిపిస్తోందట. రిజర్వేషన్ల బిల్లు అసెంబ్లీలో ప్రవేశ పెట్టేటపుడు.. పాస్ అయ్యేటపుడు.. స్పందించకుండా.. కనీసం అడ్డుకునే యత్నం చేయకుండా.. దొంగలు పడ్డ ఆర్నెల్లకు అన్నట్టు.. ఏంటీ నిర్లక్ష్యం? ఇలాగేనా.. పార్టీని రాష్ట్రంలో అధికారంలోకి తెచ్చేదన్న సందేహాలు సొంత పార్టీ లీడర్ల నుంచే వ్యక్తమవుతున్నాయట.

కేంద్ర పెద్దలు మొట్టికాయలు వేసే వరకూ ఎమ్మెల్యేలు, ఎంపీలు గుర్తించక పోవడమేంటి?

ఈ విషయంలోనే రాష్ట్ర పార్టీ ఎంత అప్రమత్తంగా ఉందో అర్థమై పోవట్లేదా? అన్న ప్రశ్న వినిపిస్తోందట. ఎక్కడో ఉన్న కేంద్ర పెద్దలు.. ఈ విషయం గుర్తించి మొట్టికాయలు వేసే వరకూ రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు విషయం అర్థం చేసుకోక పోవడమేంటన్న చర్చ నడుస్తోందట.

ఎమ్మెల్యేలొక గ్రూపు, ఎంపీలొక గ్రూపు, రాష్ట్ర నాయకత్వం మరో గ్రూపు.. ఇవన్నీ ఇలాగుంటే.. మీ లక్ష్యం కాంగ్రెస్ అయితే బీఆర్ఎస్ ని ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? దీని వల్ల పార్టీకి నష్టమని మీకు అర్థం కావడం లేదా? అన్న మాట వినిపిస్తోందట. కాంగ్రెస్ కి మనం ప్రత్యామ్నాయం అని ఎస్టాబ్లిష్ కావాలి కానీ.. నానాటికీ డీలా పడుతున్న బీఆర్ఎస్ తో పోటీ పడ్డమేంటన్న ప్రశ్న తలెత్తుతోందట.

అసెంబ్లీ ముట్టడిలో బయట పడ్డ ఎమ్మెల్యేల అనైక్యత

బీజేపీ గుర్తు కమలంలో ఎన్ని రెక్కలున్నాయో.. తెలీదు కానీ, రాష్ట్ర పార్టీ నాయకత్వంలోనూ అంతకన్నా మించిన లుక లుకలున్నాయని పార్టీ కేడర్లో బహిరంగ చర్చ నడుస్తోందట. ఒకప్పుడు బీజేపీ అంటే ఓ ఇద్దరు ముగ్గురు నేతల పేర్లే ఎక్కువగా వినిపించేవి. వారిలో ఎన్నెసి తగువులున్నా.. పైకి మాత్రం ఒక్కటిగానే కనిపించేవారు. అదే ఇప్పుడు ఎమ్మెల్యేలొక గ్రూపు, ఎంపీలొక గ్రూపు, రాష్ట్ర నాయకత్వం మరో గ్రూపు.. ఇదే అతి పెద్ద వ్యవహారం అనుకుంటే.. పాత-కొత్త నేతలది మరో గ్రూపు తయారవడంతో.. తలపట్టుకుంటోందట కేంద్ర అధిష్టానం. ఇక సంస్థాగతంగానూ ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటూ రచ్చ రచ్చ చేస్తున్నారట. దేశంలోనే అత్యంత క్రమశిక్షణ గల ఆర్ఎస్ఎస్ భావజాలంతో నడుచుకునే పార్టీ లీడర్లేనా? ఇలా బిహేవ్ చేస్తోందన్న మాట కూడా వైల్డ్ గానే వినిపిస్తోందట. వీళ్లందరిలోకీ రాజాసింగ్ ది అయితే.. అతి పెద్ద సమస్యాత్మకంగా మారిందట.

రబ్బర్ స్టాంప్ అధ్యక్షులు వద్దంటూ మరో వాదన తెరపైకి

ఎంపీల పరిస్థితి ఎలా ఉన్నా.. ఎమ్మెల్యేల్లో ఒకరిపట్ల మరొకరికి ఒక సఖ్యత

# విస్తరణలో మా మాటేమిటి?



హైదరాబాద్ : మంత్రివర్గ విస్తరణలో మాజీ ఎంపి, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి దాదాపు ఖాయం అనుకుంటున్న తరుణంలో మంగళవారం ఒక్కసారిగా పరిణామాలు మారిపోయాయి. మాల, మాదిగ సామాజిక వర్గాల సమీకరణల నేపథ్యంలో వివేక్ వెంకటస్వామికి మం త్రి పదవి దక్క డం అనుమానమేనని పా ర్టీలో ఉన్నతస్థాయి వ ర్గాలు అంటున్నా యి. మాల సామాజిక వర్గానికి ఇప్పటికే ప్రభుత్వంలో కీలక పదవులు ఉ ండటం తో తిరిగి అదే సామాజిక వర్గానికి చెం దిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పద వి ఎలా ఇస్తారని మాదిగ సామాజిక వ ర్గానికి చెందిన ఎంఎల్ఎలు తిరకాసు పెట్టడంతో అధిష్ఠానం పునరాలోచనలో పడినట్లు ఆ పార్టీ విశ్వసనీయ వర్గాల స మాచారం. ఇప్పటికే ప్రభుత్వంలో మాల సామాజికవర్గం నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్క, స్పీకర్ గడ్డం ప్రసాద్ కీలక పదవులు నిర్వహిస్తున్నారు.మాదిగ సామాజికవర్గం నుంచి మంత్రి దామోదర రాజనర్సింహ ఒక్కరికి మాత్ర మే పదవి లభించింది.దీంతో రాష్ట్రంలో మాదిగ జనాభాకు తగినట్లుగా ప్రభుత్వంలో ప్రాతిని ధ్యం లభించలేదని ఆ వర్గం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా త మకు అన్యాయం జరుగుతుందని మాదిగ సా మాజికవర్గం నేతలు ఢిల్లీ స్థాయిలో ఆందోళన విషయం తెలిసిందే. ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణలో కూడా తిరిగి అదే మాల సామాజిక వర్గాని కి చెందిన వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఎలా ఇస్తారని మాదిగ సామాజికవర్గానికి చెంది న కాంగ్రెస్ ఎంఎల్ఎలు అధిష్ఠానాన్ని నిలదీస్తున్నట్లు సమాచారం. అత్యవసరంగా హైదరాబాద్‌లో మంగళవారం మాదిగ సామాజికవర్గానికి చెందిన ఆరుగురు ఎంఎల్ఎలలో (అడ్లూరి లక్ష్మణ్, కవ్వంపల్లి సత్యనారాయణ,వేముల వీరేశం, మందుల సామ్యేల్, కాలే యాదయ్య,తోట లక్ష్మీకాంతరావు) కొందరు సమావేశమైనట్లు తెలిసింది. హాజరు కాని వారు ఫోన్ ద్వారా తమ సంఘీభావం తెలిపినట్లు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లో వివేక్ వెంకటస్వామికి బదులుగా తమ సామాజికవర్గానికి ఇవ్వాలని కోరుతూ లిఖితపూర్వకంగా అధిష్ఠానానికి లేఖ పంపించినట్లు తెలిసింది. మరోవైపు అధిష్ఠానం కూడా వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి కట్టబెట్టడానికి అంత సుముఖంగా లేనట్లుగా తెలిసింది. కాగా, దివంగత నేత జి.వెంకటస్వామి కుటుంబం నుంచి ఆయన ఇద్దరు కుమారులు వినోద్, వివేక్ ఎంఎల్‌లుగా ఉ ండగా, వివేక్ కుమారుడు వంశీకృష్ణ పెద్దపల్లి ఎంపీగా ఉన్నారు. అలాగే ఉ పముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆయన సోదరుడు ఎంపీ మల్లు రవితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అదే సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో అన్ని పదవులు ఒకే సామాజికవర్గానికి ఇస్తే తమ పరిస్థితి ఏంటని మాదిగ ఎంఎల్ఎలు అధిష్టానాన్ని ప్రశ్నిస్తూ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో అధిష్ఠానం కూడా వివేక్‌కు మంత్రి పదవి ఇచ్చే విషయంలో పునరాలోచనలో పడినట్లు ఢిల్లీ నుంచి ఆ పార్టీ వర్గాల సమాచారం. అయితే తాజా పరిణామాల నేపథ్యంలో వివేక్‌కు మంత్రి పదవి కాకుండా చీఫ్ విప్ లేదా డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే దిశగా అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలిసింది.వివేక్‌ను మంత్రి పదవి రేసు నుంచి తప్పించే పక్షంలో మాదిగ సామాజికవర్గం నుంచి మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలనే దిశగా అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందులో ప్రముఖంగా విప్ అడ్లూరి లక్ష్మణ్, పార్టీ సీనియర్ నేత కరీంనగర్ జిల్లా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. అడ్లూరికి మంత్రి పదవి ఇచ్చే విషయంలో రాష్ట్ర కీలక నేతలుగా సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఏర్పాట్లు

అమరావతి, వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి లేకుండా మందస్తు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మరోవైపు, వేసవిలో తరచూ అడవుల్లో మంటలు వ్యాపించిన సందర్భాలు ఉన్న నేపథ్యంలో.. అడవుల్లో అగ్నిప్రమాదాలుపై అప్రమత్తంగా ఉండాలన్నారు.. డ్రోన్లతో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఎండ తీవ్రతపై ఎప్పటికప్పుడు ప్రజలను అలర్ట్ చేయాలని అధికారులకు సూచించారు. రోజువారీగా నమోదవుతున్న ఉష్ణోగ్రతల సమాచారాన్ని మొబైల్ అలర్ట్స్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ మేరకు వేసవి ప్రణాళికపై డిజాస్టర్ మేనేజ్‌మెంట్, పంచాయతీ రాజ్, మున్సిపల్, వైద్యారోగ్య శాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.. రాష్ట్రంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి కనిపించకూడదని స్పష్టం చేశారు.. ముందస్తు జాగ్రత్తలతో తీసుకోవడం ద్వారా వడదెబ్బ మరణాలు తగ్గించాలన్నారు. తీవ్ర వడగాలులు వీచే అవకాశమున్న ప్రాంతాల్లో మజ్జిగ కేంద్రాలు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అడవుల్లో అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని.. ఎప్పటికప్పుడు డ్రోన్లతో పరిస్థితిని పర్యవేక్షించాలని సీఎం సూచించారు. పశువుల కోసం గ్రామాల్లో రూ.35 కోట్లతో 12,138 నీటితొట్ల నిర్మాణం జరగాలని ఆదేశించారు.. ఇక, ఎండల తీవ్రత దృష్ట్యా.. పాఠశాలల్లో వాటర్ బెల్ విధానం అమలు చేయాలని స్పష్టం చేశారు.. ఎండ వేడిమికి విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పును నివారించేందుకు వీలుగా స్కూళ్లలో వాటర్ బెల్ మోగించాలని తెలిపారు.

# అమరావతిలో జార్జియా వర్సిటీ

అమరావతి,అమెరికాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ జార్జియా నేషనల్ యూనివర్సిటీ అమరావతిలో కాలుమోపనుంది. ఇక్కడి విద్యార్థులకు అమెరికా తరహా ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం ఈ మేరకు జార్జియాతో ఒప్పంద చేసుకుంది.ఈ మేరకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సమక్షంలో జార్జియన్ నేషనల్ యూనివర్సిటీ తో రాష్ట్ర ప్రభుత్వం అవగాహన ఒప్పందం చేసుకుంది. ఉండవల్లిలోని నివాసంలో జరిగిన కార్యక్రమంలో జీఎన్‌యూ, ఏపీ ప్రభుత్వ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం అమరావతిలో ఇంటర్నేషనల్ యూనివర్సిటీ- స్థాపించడానికి జీఎన్‌యూ సుమారు రూ.1,300 కోట్లు- పెట్టుబడి పెట్టనుంది. ఈ ఒప్పందంతో 500 మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది. రాష్ట్రంలో విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో అమరావతిలో ప్రతిష్ఠాత్మక ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఏర్పాటుకు జార్జియా నేషనల్ యూనివర్సిటీ ముందుకొచ్చింది. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. జీఎన్‌యూతో ఒప్పందం రాష్ట్ర విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యను అందించడంతోపాటు ఏపీ విద్యారంగాన్ని ప్రపంచపటంలో నిలిపేందుకు దోహదపడుతుందన్నారు. విద్యా ప్రమాణాలను పెంచడమే కాకుండా ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో విజయం సాధించడానికి అవసరమైన నైపుణ్యాలు అందుతాయని తెలిపారు. ఏపీ విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దాలన్న తమ ప్రభుత్వ చిత్తశుద్ధి, నిబద్ధతకు ఈ ఒప్పందం నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్య ప్రమాణాలను మెరుగుపర్చడం, గ్లోబల్ ఎక్స్‌పోజర్, పాఠ్యాంశాలను మెరుగుపర్చడం, అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం, పరిశోధన, నవీన ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఈ ఒప్పందం ప్రధాన లక్ష్యమని లోకేశ్ వెల్లడించారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన టెక్నాలజీ, బిజినెస్, హెల్త్ కేర్ రంగాల్లో విద్యార్థులకు జీఎన్‌యూ నైపుణ్యాలను అందిస్తుందన్నారు.

# తల్లికి వందనం అమలు

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభవార్త చెప్పారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మంగళవారం కలెక్టర్ల సదస్సులో సీఎం మాట్లాడుతూ.. డీఎస్సీపై స్పష్టత ఇచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు- ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సచివాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న కలెక్టర్ల సదస్సులో మాట్లాడుతూ.. కలెక్టర్లు జిల్లా ముఖ్య నిర్వహణా అధికారులు అంటూ..ఏసీ రూమ్‌లకు కలెక్టర్లు పరిమితం కావద్దన్నారు.. సమస్యల పరిష్కారంలో కలెక్టర్లది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యమని వెల్లడించారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలన్నారు. రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన తమ విధానమని తెలిపారు. కలెక్టర్లు దర్పం ప్రదర్శించడం కాదని.. క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదరిక నిర్మూలన జరగదన్నారు. సంక్షేమం అమలు చేయాలంటే అభివృద్ధి జరగాలని అన్నారు. అప్పులు తెస్తే ఎంతకాలం కొనసాగిస్తామని ప్రశ్నించారు.వైసీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదని.. అందుకే ప్రజలు కూటమికి తిరుగులేని తీర్పు ఇచ్చారన్నారు. ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తీర్పు ఇస్తారన్నారు. 9 నెలల్లో అనేక హామీలు అమలు చేస్తూ వస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా రూ.4 వేలు పింఛన్ లేదు.. మనం ఇస్తున్నామన్నారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచామని చెప్పుకొచ్చారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌తో అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్లతో రూ.5కే భోజనం అందిస్తున్నామని.. దీపం-2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. చెత్త పన్నును తొలగించామని తెలిపారు. 2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడించారు. విజన్ 2047పై ప్రధానంగా కలెక్టర్లు దృష్టి పెట్టాలన్నారు.. పెన్షన్లను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది అన్నారు.. సోలార్ పవర్‌లో భాగంగా 20 లక్షల మందికి సోలార్ పవర్ ఇవ్వడంలో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. భవిష్యత్ ను ప్లాన్ చేసే పనిలో కలెక్టర్లు ఉండాలని స్పష్టం చేశారు.. ప్రజల్లో అత్యంత ప్రభావం కలిగించే వ్యక్తి కలెక్టర్.. కెరీర్‌లో కలెక్టర్... చీఫ్ సెక్రెటరీకి ఇవే ముఖ్యం అన్నారు.. ఇక, రొటీన్‌గా ఉంటే ఏడాది అవుతుంది.. మరో నాలుగేళ్లు కూడా గడిచిపోతాయి అన్నారు. ఈ ప్రభుత్వం.. సంక్షేమం.. అభివృద్ధి.. సుపరిపాలన... ఈ మూడు గుర్తుండాలి.. ప్రజలు ఆనందంగా ఉండాలంటే సంక్షేమం కావాలి.. పెన్షన్ల విషయంలో ప్రభుత్వం చాలా ఉదారంగా ఉంది.. కేవలం పెన్షన్ల కోసం ఏడాదికి 33 వేల కోట్లు అవుతోందని వెల్లడించారు. అమరావతి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్.. ప్రజల్ని ప్రోగ్రెస్ లో భాగస్వామ్యం చేయాలన్నారు.. 20 లక్షల మందికి సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు- చేస్తాం.. ఎట్టి పరిస్థితుల్లో కలెక్టర్లు.. సోలార్ రూఫ్ టాప్ పై దృష్టి పెట్టాలన్నారు.. ప్రీ మాన్‌సూన్ పోస్ట్ మాన్‌సూన్ పై దృష్టి సారించాలి..

# క్లైమాక్స్‌లో ఛాన్స్ కొట్టేసేందుకు కొందరి యత్నాలు..



హైదరాబాద్,రోజుకో అప్డేట్.. లీకుల మీద లీకులతో పదిహేను నెలలుగా తెలంగాణ క్యాబినెట్ విస్తరణ డైలీ ఎపిసోడ్‌గా కొనసాగుతోంది. ఇప్పుడు ఢిల్లీలో జరుగుతోన్న డెవలప్‌మెంట్స్‌ను బట్టి చూస్తే ఈ సారి మంత్రివర్గ విస్తరణ పక్కా అంటున్నారు. ఉగాది తర్వాత ఒకటి రెండ్రోజుల్లోనే కొత్త మంత్రుల ప్రమాణస్వీకారం ఉంటుందని చెబుతున్నారు.అయితే ఢిల్లీ వెళ్లిన హస్తం పార్టీ పెద్దలు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రకరకాల చర్చలు జరిపారట. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆరు బెర్తుల్లో.. మొదటగా అధిష్టానం హామీ ఇచ్చినవారికి చోటు కల్పించాలని నిర్ణయించారట. అందులో భాగంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్‌తో పాటు పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం వాకిట శ్రీహరి ముదిరాజ్‌కు బెర్తులు కన్ఫామ్ అయ్యాయని అంటున్నారు.ఇక మిగతా మూడు బెర్తులలో కూడా ఒకటి కచ్చితంగా బీసీలకు ఇవ్వాలని చూస్తున్నారు. రెండో బీసీ పేరు విషయంలో రకరకాల సమీకరణాల తర్వాత ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు అవకాశం దక్కబోతోందట. ఇప్పటికే నల్లగొండ జిల్లా నుంచి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంత్రులుగా ఉండగా రాజగోపాల్‌రెడ్డికి అవకాశం దక్కనుంది.

ఐలయ్యకు అవకాశం ఇస్తే?

దీంతో ఒక జిల్లా నుంచి ముగ్గురు రెడ్లు ఉంటే క్యాస్ట్ ఈక్వేషన్స్ బట్టి చూస్తే రాంగ్ ఇండికేషన్స్ వెళ్లే ప్రమాదం ఉందని భావిస్తున్నారట. అందుకే అదే జిల్లా నుంచి బీర్ల ఐలయ్యకు మంత్రిగా ఛాన్స్ ఇవ్వాలని చూస్తున్నారని టాక్. అంతేకాదు ఐలయ్యకు అవకాశం ఇస్తే అతిపెద్ద సామాజికవర్గమైన యాదవ సామాజిక వర్గానికి చోటు కల్పించినట్లు అవుతుందని లెక్కలు వేసుకుంటున్నారట. దీంతో ఒక్క భర్తీతో రెండు ఈక్వేషన్స్ వర్కౌట్ చేసినట్లు అవుతుందని కాంగ్రెస్ పెద్దల ఆలోచనగా చెబుతున్నారు.ఇలా నాలుగు బెర్తులు ఖాయం కావడంతో మిగిలిన రెండు బెర్తుల విషయంలో ఒక దాని కోసం సీఎం రేవంత్ రెడ్డి గట్టి పట్టుబడుతున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేదు. దీంతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కచ్చితంగా అవకాశం ఇవ్వాలని సీఎం కోరుతున్నారట. సుదర్శన్‌రెడ్డి విషయంలో సీఎం చాలా సీరియస్‌గా ప్రయత్నాలు చేసి అధిష్టానాన్ని ఒప్పించినట్లు టాక్ నడుస్తోంది. సుదర్శన్‌రెడ్డి విషయంలో సీఎం సక్సెస్ కావడంతో..డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రేమ్‌సాగర్‌రావుకు మినిస్ట్రీ ఇవ్వాలని పట్టు పడుతున్నారట.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్‌తో పాటు ప్రేమ్‌సాగర్‌రావుకు కూడా ఇవ్వాలని అందుకుదగ్గ ఈక్వేషన్స్‌ను కూడా భట్టి వివరించారట. భట్టి చెప్పిన వాటికి అధిష్టానం కన్విన్స్ అయ్యిందని..అందులో భాగంగా ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రివర్గంలో ఛాన్స్ దక్కనున్నట్లు గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. ఇలా మొత్తం మీద ఆరు బెర్తులకు ఆరుగురు పూర్తికావడంతో..మైనారిటీలకు ఛాన్స్ లేదనే టాక్ వస్తుంది. దీంతో మైనారిటీలకు అవకాశం కల్పించాలంటే ప్రస్తుతం ఉన్న మంత్రులలో ఒకరికి ఉద్వాసన పలికి మైనారిటీ కోటాలో అమీర్ అలీఖాన్‌కు ఛాన్స్ ఇవ్వొచ్చన్న చర్చ జరుగుతోంది.

మంత్రుల పోర్ట్ ఫోలియోలు కూడా మారుస్తారా?

మంత్రివర్గ విస్తరణతో పాటు పనితీరు ఆధారంగా మంత్రుల పోర్ట్ ఫోలియోలు కూడా మారుస్తారని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న శాఖలతో పాటు సీఎం దగ్గరున్న శాఖలను కేటాయించే విషయంపై కూడా అధిష్టానం దగ్గర చర్చ జరిగిందట.సీనియర్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తన దగ్గరున్న శాఖలలో మార్పు చేయాలని కోరుతున్నారట.తన ఇరిగేషన్ శాఖను మార్చి రెవెన్యూశాఖ ఇవ్వాలని కోరుతున్నారట. రెవెన్యూశాఖ మంత్రిగా ఉన్న పొంగులేటికి..సీఎం దగ్గరున్న అర్బన్ డెవలప్‌మెంట్ మినిస్ట్రీ ఇవ్వాలని చూస్తున్నారట. ఇరిగేషన్ శాఖను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఇస్తారని చర్చ జరుగుతోంది. ఇక అమాత్య బెర్తులు కన్ఫామ్ అని కాన్ఫిడెంట్‌గా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, గడ్డం వివేక్, వాకిట శ్రీహరి ముదిరాజ్‌లు కూడా ఏయే శాఖలు తీసుకుంటే బాగుంటుందనే దానిపై తమ సన్నిహితులతో చర్చిస్తున్నారట.తెలంగాణ క్యాబినెట్ విస్తరణ అంశం తుదిదశకు వచ్చినప్పటికీ ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. క్లైమాక్స్‌లో ఛాన్స్ కొట్టేసేందుకు కొందరు ట్రై చేస్తుంటే.. మంత్రిగా బెర్త్ కన్ఫామ్ అయినవారు శాఖలపై దృష్టి పెట్టారు.మరోవైపు సీనియర్ మంత్రులు కూడా తమ శాఖలను మార్పులు కోరుతున్నారు.ఇలా ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నా..కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది వేచి చూడాలి.

# పెట్రోల్,డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి తేవాలి

న్యూఢిల్లీ,పన్నుల వ్యవస్థలో సహేతుకమైన మార్పులు చేయాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ జనాన్ని దోచుకోడం మానుకోకుంటే సమాజంలో అస్థిరతకు కారణం కాగలదు. పెట్రోల్, డీజెల్, వంటగ్యాస్‌పై పన్ను అక్కడికక్కడే చేతికి వచ్చి ఖజానాలను నింపుతాయి కాబట్టి వాటిని తగ్గించుకోడానికి పాలకులు వెనకాడుతున్నారు. అనుత్పాదక రంగాలకు అతిగా ఖర్చు పెట్టడం మానుకోవాలి. ఓట్లను రాబట్టే పథకాలను పక్కన పెట్టాలి. వస్తు, సేవల పన్ను నుంచి పెట్రోల్, డీజెల్‌ను మినహాయించడంలో ఆంతర్యం వాటి మీద తాము ఎప్పుడుబడితే అప్పుడు పన్నులను విధించి రాబడి పెంచుకోవాలన్న దురుద్దేశ్యం తప్ప మరోటి కానరాదు. ఇంధన ధరలను అదుపు చేయడంతో పాటు, సామాన్యులకు కూడా ధరలు అందుకునేలా ఉండాలి. పెట్రోట్, డీజెల్‌పై కేంద్రం వసూలు చేస్తున్న ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించుకోడం సరైన నిర్ణయంగా గుర్తించాలి. అదేపనిగా పన్నుల రూపంలో ప్రజలను దోచుకోవడం తగదని గుర్తించాలి. అసలే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రజలపై భారాలు మోపడం సరికాదని పాలకులు గమనించాలి. పెట్రోలులపై ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం తగ్గించుకుంటేనే ఆ మేరకు వీటి ధరలు తగ్గి ప్రజలకు కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కేంద్ర ప్రభుత్వం విధించే స్పెషల్ సుంకాలలో రాష్ట్రాలకు వాటా వుండదు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం తన ఆదాయానికి ఈ స్పెషల్ సుంకాల విధింపుపై ఆధారపడడం ఎక్కువైంది. ఇలాంటి సుంకాలతో భారం మోపే బదులు పాలకులు తమ ఖర్చులను తగ్గించుకోవడం మంచిది. కానీ తాజాగా ఎంపిల జీతభత్యాలను, పెన్షన్లు పెంచుకున్నారు. ఇంతకన్నా దారుణం మరోటి ఉండదు. పెట్రోల్ చిల్లర ధరలో 54 శాతం కేంద్ర, రాష్ట్రాలు విధించే పన్నుల కిందే పోతుంది. అలాగే డీజెల్ ధరలో 49 శాతం ఈ పన్నులే వుంటాయి. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్‌పై ప్రతి లీటర్ వద్ద రూ. 32.9 మేరకు ఎక్సైజ్ సుంకాన్ని వసూలు చేస్తున్నది. అలాగే డీజెల్ మీద రూ. 31.8 తీసుకుం




టున్నది. రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసే అమ్మకపు పన్ను లేదా విలువ ఆధారిత పన్నులు ఇందుకు అదనంగా వుంటాయి. జీఎస్టీ పేరుతో ఇప్పటికే వాయింపులు ప్రజలు తట్టుకోలేక పోతున్నారు. నేలవిడిచి సాము చేసే పద్ధతిని విడనాడాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజెల్‌పై తాము వసూలు చేసే పన్నులను గణనీయంగా తగ్గించుకోగలిగితే ప్రజలపై భారం తగ్గి వాటిని సునాయాసంగా కొనుగోలు చేయగలుగుతారు. దేశంలో వినియోగిస్తున్న చమురులో 85 శాతం దిగుమతి చేసుకుంటున్నదే. దేశీయంగా చమురు ఉత్పత్తిని పెంచే ప్రయత్నాలేవీ ఫలించలేదు. ప్రభుత్వరంగ సంస్థ అయిన ఓఎన్‌జిసి కష్టపడి శోధించిన చమురు, గ్యాస్ నిక్షేపాలను పూర్తి స్థాయిలో వెలికి తీయకుండానే ఈ రంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించారు. దానితో ప్రైవేటు కంపెనీలకు మేలు చేసిన వారు అవుతున్నారు. ఈ లెక్కన త్వరలోనే దేశంలో పెట్రోల్, డీజెల్ ధరలు కనీసంగా రూ.115 లకు చేరే ప్రమాదమున్నది. ప్రభుత్వాలు తమ దోపిడీ విధానాలను పక్కన పెట్టి ప్రజలను పన్నుల భారం నుంచి తప్పించాలి. దుబారా తగ్గించుకోవడం చేయాలి.

# సీస్కోతో ఒప్పందం చేసుకున్న మంత్రి లోకేశ్



అమరావతి,ఐటీ , అడ్వాన్స్డ్ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధి కోసం ఏపీ ప్రభుత్వం సిస్కోతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో సిస్కో- ఏపీఎస్ఎస్ డీసీ ఎంవోయు జరిగింది. ఈ ఒప్పందం ద్వారా 50 వేల మంది యువతకు డిజిటల్, ఐటీ నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారు. విద్యార్థుల్లో ఐటి, అడ్వాన్స్డ్ టెక్నాలజీ నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రఖ్యాత ఐటి సంస్థ సిస్కో, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ నడుమ ఒప్పందం జరిగింది. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో ఉండవల్లి నివాసంలో ఇరుపక్షాల ప్రతినిధులు ఎంవోయుపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం సిస్కో విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్యాలను విస్తరించడానికి నెట్‌వర్కింగ్, సైబర్ సెక్యూరిటీ, వంటి రంగాలలో అత్యాధునిక కంటెంట్‌ను అందిస్తోంది. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఏ కోర్సుల్లో శిక్షణ అందించాలో ఉన్నత విద్యాశాఖ నుంచి ప్రాధాన్యతల ఆధారంగా కోర్సుల జాబితాను ఖరారు చేస్తారు. అధికారుల్లోనూ డిజిటల్ నైపుణ్యాలను పెంపొందించనుంది. ఆంధ్రప్రదేశ్ అంతటా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. ఉన్నత విద్యాసంస్థల్లో విద్యనభ్యసించే విద్యార్థులలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్యను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం ముఖ్యోద్దేశం. నైపుణ్యం కలిగిన మానవ వనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడం, ఉపాధిని పెంపొందించడమే ఈ సహకారం లక్ష్యం. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల్లో డిజిటల్ నైపుణ్య సామర్థ్యాన్ని పెంపొందించేలా సిస్కో వర్చువల్ విధానంలో పోర్టల్ ద్వారా స్వీయ-అభ్యసన, బోధకుల నేతృత్వంలో ఇండస్ట్రీ ఎక్స్‌పోజర్ ప్రాక్టికల్ ఎక్స్ పీరియన్స్ కోర్సుల్లో శిక్షణ ఇస్తుంది. విద్యార్థులకు ఆయా సంస్థల డిమాండ్ ఆధారిత కోర్సుల్లో శిక్షణా కార్యక్రమాలను డిజైన్ చేస్తారు. మారుతున్న సాంకేతికలకు అనుగుణంగా ముందస్తు అవసరాలకు సరిపడా సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్న ఏపీ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అవసరాలకు అనుగుణంగా లెర్నర్ పార్టిసిపేషన్, కాంపిటీషన్స్, ఫ్యాకల్టీ ట్రైనింగ్, వర్క్ షాప్స్ నిర్వహణ వంటివి ఏపీఎస్ఎస్ డీసీ చేపడుతుంది. ఆయా కోర్సుల్లో విజయవంతంగా శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులు, ఉద్యోగులకు సిస్కో సర్టిఫికెట్లను జారీచేస్తుంది. ఏపీఎస్ఎస్ డీసీ ద్వారా విద్యార్థులకు వర్చువల్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ లను అందిస్తారు. అధునాతన టెక్నాలజీలో యువత, విద్యార్థులకు మద్దతునిచ్చే ఫైండ్ యువర్ సెల్ఫ్ ఇన్ ద ఫీచర్ (ఎఫ్‌వైఐఎఫ్) వంటి ప్రోగ్రామ్ లను సిస్కో సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుంది.

# ఎంతకీ కొలిక్కిరాని తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎంపిక.. ఎందుకంటే?

హైదరాబాద్,క్లైమాక్స్‌లో ట్విస్టులు..ఎండ్ కార్డ్ పడే సమయంలో కొత్త క్యారెక్టర్ ఎంట్రీ ఇచ్చిన లెవల్‌లో.. తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి..పొలిటికల్ పిక్చర్‌ను తలపిస్తోంది. ఆల్మోస్ట్ స్టేట్ చీఫ్ సెలెక్షన్ కంప్లీట్ అయిందని..ఏ క్షణమైనా కాషాయ రథసారథి ఎంపికపై ప్రకటన వస్తుందని..రెండు మూడు నెలలుగా ప్రచారం జరుగుతోంది. కానీ బీజేపీ చీఫ్ ఎంపిక ఎటూ తేలడం లేదు. పార్టీలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా నేతలు తీరు ఉండటంతో అందరినీ కలుపుకుపోయే నాయకుడి కోసం అధిష్టానం జల్లెడ పడుతోందట.ఫలానా నాయకుడు రాష్ట్ర అధ్యక్షుడు అవుతారని కచ్చితంగా ముఖ్యనేతలు కూడా చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇదే కన్ఫ్యూజన్ బీజేపీ హైకామాండ్‌లోనూ నెలకొందట. ఎందుకంటే తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదివిని ఆశిస్తున్నవారి సంఖ్య పెద్దగానే ఉంది.పైగా రోజు రోజుకు ఆశావహులు పెరుగుతూ పోతున్నారు.పార్టీలో పాత నేతలు, కొత్తగా వచ్చిన నేతలు, దూకుడుగా వ్యవహరించే లీడర్స్..ఇలా రకరకాల ఈక్వేషన్స్‌తో ఎవరికి వారే అధ్యక్ష పదవి తమకేనని చెప్పుకుంటున్నారు. అధిష్టానం తమవైపే మొగ్గుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరి అనుకూలతలు వాళ్ళు చెప్పుకుంటూ..ఢిల్లీ పెద్దల ఆశీర్వాదం తమకే ఉందని ప్రచారం చేసుకుంటున్నారు. ఇదే ఇప్పుడు బీజేపీ హైకమాండ్‌కు తలనొప్పిగా మారిందట. పార్టీలో గతంలో ఎన్నడూ లేనిది ఇప్పుడు ఈ కొత్త సంప్రదాయం ఏంటని వాపోతున్నారట.

వీళ్ల పేర్లు తెరపైకి..

బీజేపీ స్టేట్ చీఫ్ రేసులో బండి సంజయ్, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావుకు తోడు ఇప్పుడు కొత్తగా రామచందర్ రావు, ఆచారి లాంటి వాళ్ల పేర్లు తెరపైకి వచ్చాయి. ఎవరికి వారు ఆర్ఎస్ఎస్ నేతలతో, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో, కేంద్రమంత్రులతో, బీజేపీ కేంద్ర పెద్దలతో ఉన్న పరిచయాలతో లాబీయింగ్ చేస్తున్నారట. ఈ క్రమంలో పార్టీ అధ్యక్ష పదవి ఫలానా క్వాలిటీస్ ఉన్నవారికే ఇవ్వాలని ఓ వర్గం చెబుతుంటే.. క్వాలిటీస్ కాదు సీనియారిటీ ఇంపార్టెంట్ అన్నది మరోవర్గం వాదనట.ఇలా నేతలు ఎవరికి వారే తమ ప్రాధాన్యతల్ని కొత్త అధ్యక్ష పదవి మీద రుద్దే ప్రయత్నం చేయడంతో అసలేం జరుగుతోందో అర్థంకాని డైలమాలో పడిపోయిందట బీజేపీ హైకమాండ్. ఈ పరిస్థితుల్లో అధ్యక్ష పదవిని ఒకరికిస్తే మరొకరి అసంతృప్తి తప్పదు..ఒక వర్గానికి ఇస్తే మరో వర్గం ఒప్పుకునే పరిస్థితి కనిపించడం లేదు. మరీ ముఖ్యంగా తెలంగాణ బీజేపీ చీఫ్ పదవి రేసులో ఎంపీల పేర్లే వినిపిస్తున్నాయి కాబట్టి ఎంపీల్లో ఎవరికో ఒకరికి ఇచ్చినా చివరికి వాళ్లలో కూడా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని ఢిల్లీ పెద్దలు ఆందోళన చెందుతున్నారట.బండి సంజయ్‌కి మళ్లీ అవకాశం ఇస్తే ఈటల రాజేందర్ అలకబూనే అవకాశం ఉందని అనుమా



నిస్తున్నారు.పోనీ ఈటలకు ఛాన్స్ ఇస్తే పార్టీలోని పాతవర్గం అసంతృప్తి చెందుతుందని డౌట్ వ్యక్తం చేస్తున్నారు. ఇలా కొత్తవారికి ఇస్తే పాత వారితో పంచాయతీ.. అలా కాదని పాత వాళ్ళకు ఇస్తే మా సంగతేంటన్నది కొత్త నాయకుల ప్రశ్న. దీంతో అందరి ఆమోదంతో కాకున్నా మెజార్టీ నేతల సమ్మతితో అధ్యక్ష ఎంపికచేద్దామన్నా కమలం పార్టీ హైకమాండ్‌కు ఎటూ పాలుపోవడం లేదట.

ఎవరెవరు నామినేషన్స్ వేస్తారు?

ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాటు, ఎవరికి వారి ఎక్స్ పెక్టేషన్స్, లాబీయింగ్‌తో సిచ్యువేషన్ త్రిశంకు స్వర్గంలో పడిపోయిందట. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల అధికారి, కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే వారం రోజుల్లో హైదరాబాద్ రానున్నారని తెలుస్తోంది. ఆమె ఇక్కడ సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్స్ తీసుకుంటారని అంటున్నారు. దీంతో ఎవరెవరు నామినేషన్స్ వేస్తారు. ఇంత క్లిష్ట పరిస్థితుల్లో ఎవరికి తెలంగాణ అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పుతారు అన్నది ఉత్కంఠ రేపుతోంది.గతంలో బీజేపీ అధ్యక్ష ఎంపిక అంటే ప్రతీ రెండేళ్లకోసారి మార్చేవారు. ఒక్కోసారి ఒకే నేతను రెండు టర్మ్‌లు కంటిన్యూ చేసేవారు. బండి సంజయ్ అధ్యక్షుడు అయ్యే వరకు కూడా అలాగే ఉండేది. అధిష్టానం ఓ నేత పేరును ప్రకటించేది. అందరూ ఆయన సారథ్యంలోనే పనిచేసేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి కాస్త డిఫరెంట్‌గా ఉంది.తెలంగాణలో పార్టీ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని.. ఒకవేళ పవర్‌లోకి రాకపోయిన కీరోల్ ప్లే చేసే ఛాన్స్ ఉంటుందని అంచనా వేస్తున్న నేతలంతా..బీఆర్ఎస్, కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. అందులో ఈటల రాజేందర్, రఘునందర్ రావు, డీకే అరుణ లాంటి నేతలు అధ్యక్ష పదవి కోసం గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త, పాతల పంచాయతీతో కాషాయ రథసారథి ఎంపిక ఎటూ తేలడం లేదంటున్నారు. వచ్చే నెలలో అయినా అధ్యక్ష ఎంపిక కొలిక్కి వస్తుందా రాదా అనేది చూడాలి మరి.

# పేదరిక నిర్మూలనకు కృషి జరగాలి...

న్యూఢిల్లీ, మనిషి ఎదుగడానికి అభివృద్ధి మార్గాలు తెరిచి పెట్టడమే పేదరిక నిర్మూలన పథకాల లక్ష్యం కావాలని ఐక్యరాజ్య సమితి ఘోషిస్తున్నది. ఈ భావనతోనే అభివృద్ధి వ్యూహాలకు రూపకల్పన చేశారు. గతంలో ఉమ్మడి రాష్ట్ర పాలకులకు ప్రచారార్భాటమే తప్ప పేదరిక నిర్మూలన పట్ల చిత్తశుద్ధి ప్రకటించలేదు. అందుకే ప్రజలకు దానిపై ఆసక్తి కూడా క్రమంగా తగ్గుతూ వస్తోంది. బడ్జెట్ అంటే సంవత్సరానికొక్కమారు ప్రభుత్వాలు చట్టసభల్లో ప్రవేశపెట్టే తద్దినంగా ప్రజలు భావించే స్థితి వచ్చిందంటే దానికి కారణం పాలకులు వాటిని వాస్తవ పరిస్థితులకు దూరంచేసి అంకెల గారడీగా మార్చడమే. పేదల సంక్షేమానికి పెద్దపీట వేయడం, వ్యవసాయం దాని అనుబంధ రంగాలకు జవజీవాలు సమకూర్చడం, కులవృత్తులకు ఆలంబన, గ్రామీణ సమాజాన్ని అభివృద్ధి కాముకమైనదిగా చూడటం మొదలైనవన్నీ ఆర్థిక ప్రగతికి దోహద పడతాయి. పదేళ్లపాటు నిరాఘాటంగా పాలన చేసిన కాంగ్రెస్ దేశాన్ని, రాష్ట్రాలను సర్వనాశనం చేసింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దిగజారింది. కులవృత్తులకు ప్రాధాన్యం లేకుండా పోయింది. చిన్ననీటి పారుదల రంగం వట్టి పోయింది. ప్రాజెక్టులు, మేఘమథనం పేరుతో ఉమ్మడి ఎపిని దోచుకుతిన్నారు. అయితే ఇలాంటి వారే ఇప్పుడు గగ్గోలు పెడుతన్నారు. గతంలో బడ్జెట్‌లో కేటాయింపులు ఘనంగా చూపించడం ఖర్చుల్లో కోతలు పెట్టడం ప్రభుత్వాల ఘన కార్యాలుగా చెప్పుకున్నారు. బడ్జెట్‌లో తాయిలాలు ప్రకటించడం, భారాలు తరువాత వేయడం కూడా మరో ఎత్తుగడ వేయడం కాంగ్రెస్ హయాంలో జరిగిందని చెప్పడానికి అనుమానాలు అక్కర్లేదు. వార్షిక బడ్జెట్‌లో ఇలాంటి విన్యాసాలన్నిటినీ గతంలో ప్రదర్శించారు. బడ్జెట్ అంకెలకూ వాస్తవ ఖర్చులకూ సంబంధం లేకుండా ప్రభుత్వ వ్యవహారాలు నడిచాయి. సామాజికాభివృద్ధిని ఆర్థిక కోణంలోనే చూడలేము. పారిశ్రామికాభివృద్ధి ఒక్కటే కొలమానం కాదు. సమాజ సంపూర్ణ వికాసమే అసలైన అభివృద్ధి అని గుర్తిస్తేనే ముందుకు సాగుతాం. గ్రామీణ శ్రామిక సమాజ శక్తియుక్తులను సంపూర్ణంగా వినియోగంలోకి తేవడానికి బృహత్ ప్రయత్నం సాగడం ముఖ్యం. అభివృద్ధి ముసుగు తొడిగిన విదేశీ ఆర్థికవేత్తల సలహాలు, ఆధునికత పేర అడుక్కు తెచ్చుకున్న ఆర్థిక నమూనాలు కాదు మనకు కావలసింది. మన సమస్యలకు మన దేశీ య విధానాలలోనే పరిష్కారం సాధించాలన్న దృక్పథంతో ముందుకు సాగుతున్న తీరు ముదావహం. రైతులు, గొర్రెల పెంపకం దారులు, చేపలు పట్టేవారు, కంసాలి, కమ్మరి, వడ్రంగి వంటి విశ్వకర్మవర్గీయులు, నేతపనివారు- ఇట్లా సమస్త వృత్తుల సమాహారమే గ్రామీణ సమాజం. వీరందరికి కులవృత్తులలో



తరతరాలుగా పెంపొందించుకున్న అపారమైన నైపుణ్యం ఉంటుంది. ఉన్నత విద్యావంతులు కూడా వృత్తి నైపుణ్యంలో వీరికి సరితూగ లేరు. గ్రామీణ సమాజంలో అపారంగా ఉన్న మానవ వనరులను, వృత్తి నైపుణ్యాన్ని తగురీతిలో ఉపయోగంలోకి తేవడమే లక్ష్యమని గమనిస్తే తెలిసిపోతుంది. ఓ రకంగా గతంలో కన్నా మేలైన కార్యక్రమాలు సాగుతున్నాయి. ఇదంతా అభివృద్ధి నిర్మాణంలో భాగంగా సాగుతున్నదని గుర్తించాలి.

# ఆధార్ తరహాలో హెల్త్ డిజిటల్ కార్డులు



హైదరాబాద్, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆధార్ కార్డు తరహాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డులు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఏడాది కింద ప్రకటించారు. అయినా నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. ప్రజల హెల్త్ ప్రొఫైల్ తయారు చేస్తామని కెసిఆర్, రేవంత ప్రకటించినా ఇద్దరూ మాటతప్పారు. గతేడాది జులై నుంచి హెల్త్ ప్రొఫైల్ కార్డులను ఇస్తామని రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం, ప్రజలు గర్వించేలా పనిచేస్తామన్నారు. ఆధార్ నెంబర్ తరహాలో ఒక్కో పౌరుడికి స్మార్ట్ కార్డు వంటి హెల్త్ ప్రొఫైల్ కార్డు ఇస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన చికిత్స అందించేందుకు వీలుగా డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డును ప్రత్యేక నంబర్‌తో అనుసంధానం చేయనున్నారు. హెల్త్ ప్రొఫైల్ కార్డుపై ఉన్న నెంబర్ గానీ.. పేరు గానీ ఎంటర్ చేయగానే.. ఆ వ్యక్తికి సంబంధించిన వైద్య సేవల వివరాలు తెలుస్తాయనా అన్నారు. దీని వల్ల వారు ఏ వైద్యుడిని సంప్రదించినా.. వారివారి ఆరోగ్య స్థితిగతులను వెంటనే తెలుసుకునే వీలు ఉంటుందని.. మెరుగైన వైద్యసేవలు పొందేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. కానీ ఏడాది గడిచింది. దీనిపై అడుగు ముందుకు పడలేదు. కనీసం చర్చ లేదు. ఎక్కడా కార్యాచరణ కానరావడం లేదు.

# జగ్గయ్యపేటలో భారీ అగ్ని ప్రమాదం

అమరావతి,ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. జగయ్యపేట మండలం తొర్రగుంటపాలెంలోని మిర్చి కోల్డ్ స్టోరేజీ గోడౌన్‌లో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి గిడ్డంగి మొత్తానికి వ్యాపించడంతో భారీగా అగ్నికీలలు ఎగసిపడుతున్నాయి. దీంతో మిర్చి నిల్వలు దగ్ధమవుతున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేస్తున్నారు. గోడౌన్‌లో సుమారు రూ.12 కోట్ల విలువైన మిర్చి నిల్వలు ఉన్నట్లు సమాచారం. కాగా, గోదామ్‌లో మొత్తం 40 వేల మిర్చి బస్తాలు ఉన్నాయని సమాచారం. అన్నీ కాలిబూడిదయ్యాయి. పొగ, మిర్చి ఘాటుతో పరిసర గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తుమ్ములు, దగ్గుతో గ్రామస్తులు అవస్తలు పడుతున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com